శోక సంద్రంగా నేపాల్ గ్రామాలు

- మృతులకు సామూహిక అంత్యక్రియలు
- క్షతగాత్రులకు ఉచిత వైద్యం : ప్రభుత్వ ప్రకటన
- మరోసారి ప్రకంపనలు

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 96 | విజయవాడ, సోమవారం 6 నవంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 6 November 2023 | Rs

సచిన్ సరసన కోహ్లి

- వన్డే సెంచరీల రికార్డు సమం



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 49 అంతర్జాతీయ వన్డే సెంచరీల ప్రపంచ రికార్డును విరాట్ కోహ్లి సమం చేశాడు. ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో తన 35వ పుట్టిన రోజునే కోహ్లి (101 పరుగులు) ఈ ఘనత అందుకున్నాడు. 277 ఇన్నింగ్స్‌లోనే కోహ్లి తన 49వ వన్డే శతకాన్ని సాధించాడు. కోహ్లికి ఇది మొత్తంగా 79వ అంతర్జాతీయ శతకం (29 టెస్టులు, ఒక టీ20 శతకం).



ఏడాదిలో 7 మిల్లులు మూత

సంక్షోభంలో టెక్స్‌టైల్ పరిశ్రమ

రాయితీ బకాయిలు ఇవ్వని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో టెక్స్‌టైల్ పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది. మొత్తం వంద స్పిన్నింగ్ మిల్లులు ఉండగా, గత ఏడాది కాలంలో ఏడు మిల్లులు మూతపడ్డాయి. దీనివల్ల వేలాది మంది కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడింది. మొత్తం మిల్లుల్లో దాదాపు లక్ష మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. గుంటూరు, ప్రకాశం, కృష్ణా, పశ్చిమగోదావరి తదితర జిల్లాల్లోని మిల్లులు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాయి. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం పరిధిలో 85 మిల్లుల వరకు ఉన్నాయి. వాటిలో 50 శాతం మాత్రమే నిర్వహించగలుగుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీలు సకాలంలో రాకపోవడంతో మిల్లులను నడపలేకపోతున్నామని వాటి యజమానులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి టెక్స్‌టైల్ అప్‌డేషన్ ఫండ్ (టఫ్) రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం 2012 నుంచి బకాయిలను పెండింగ్ పెట్టింది. ఏటా ఈ మిల్లులకు కేంద్రం నుంచి రూ.250 కోట్లు ఈ నిధి నుంచి రావాల్సి ఉంది. ఇవి రావడం లేదు. మరోవైపు రాష్ట్రంలోని మిల్లులకు విద్యుత్ రాయితీల సొమ్ము రూ.1,500 కోట్ల వరకు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది. 2017 నుంచి రాయితీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలి విడతగా రూ.250 కోట్ల విద్యుత్ బకాయిలు విడుదల చేసింది. ఏటా ఇదే రీతిలో బకాయిలు విడుదల చేస్తామని సిఎం జగన్ ప్రకటించినా, గత రెండేళ్లుగా రాయితీ సొమ్ము విడుదల కాలేదు. విద్యుత్ ఛార్జీల పెరుగుదల వల్ల ఏటా భారం పెరుగుతోంది. మిల్లుల నుంచి ప్రస్తుతం యూనిట్‌కు రూ.9.50 నుంచి రూ.10.50 వరకు వసూలు చేస్తున్నారు. ట్రూఅప్ ఛార్జీలు, ఇతర తనపు ఛార్జీల వసూళ్లతో విద్యుత్ బిల్లుల భారం పెరిగిందని రాష్ట్ర టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కోటిరావు తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది యూనిట్‌కు రూ.2 నుంచి రూ.3 వరకు ఛార్జీలు పెరిగాయి. కేజీ యారన్ (నూలు) ఉత్పత్తి చేయాలంటే మూడు యూనిట్ల విద్యుత్ అవసరం. సగటున కేజీకి రూ.9 అదనంగా ఖర్చు అవుతోంది. ఇది మిల్లులకు భారంగా మారింది. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా పత్తి ఉత్పత్తి తగ్గడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటున్నారు. దీనివల్ల రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల కూడా ఎగుమతులు తగ్గి సంక్షోభం మరింత పెరిగింది. ముడిసరుకు ధర పెరగడం, ప్రాసెసింగ్ ఖర్చులు పెరగడం వల్ల నిర్వహణ కష్టతరంగా మారిందని కోటిరావు తెలిపారు. విద్యుత్ ఛార్జీల భారం నుంచి బయటపడడానికి సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రలోభాల పర్వం


భారీగా నగదు, మద్యం, మాదకద్రవ్యాల స్వాధీనం

2018 ఎన్నికలతో పోలిస్తే మూడు రెట్లు అధికం

తెలంగాణలో అత్యధికంగా రూ.439 కోట్లు

న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రలోభాల పర్వం ఊపందుకుంది. పలు రాష్ట్రాల్లో నువ్వా? నేనా? అన్నట్టుగా పోటీ ఉండటంతో పాలక పార్టీలు భారీగా నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, ఇతర బహుమతులను కుమ్మరిస్తున్నాయి. వాటిలో కొద్దిమేర అధికారుల తనిఖీల్లో లభ్యమైంది. ఆయా రాష్ట్రాల్లో 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, ఇతర బహుమతుల విలువతో పోలిస్తే ఇప్పటికే స్వాధీనం చేసుకున్న వాటి విలువ మూడు రెట్లు ఎక్కువగా ఉంది.

కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికలు జరిగే ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన అక్టోబర్ 9వ తేదీ నుండి ఇప్పటివరకూ రూ.953.34 కోట్ల నగదుతో పాటు ఆభరణాలు, బంగారం, వెండి, మద్యం, మాదకద్రవ్యాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ రాష్ట్రాల్లో 2018 ఎన్నికల ప్రచారం సందర్భంగా రూ.288.58 కోట్ల విలువైన వస్తువులు, నగదును మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. అంటే ఈసారి గతంతో పోలిస్తే ఇప్పటికే స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల విలువ రూ.660 కోట్లు పెరిగింది. చాలా ప్రాంతాల్లో పోలింగ్‌కు ఇంకా 25 రోజుల సమయం ఉంది. అప్పటికి స్వాధీనం చేసుకునే నగదు, ఇతర వస్తువుల విలువ భారీగా పెరగవచ్చునని భావిస్తున్నారు.



ఛత్తీస్‌గఢ్‌లో గత నెల 31వ తేదీ నాటికి రూ.38.34 కోట్లు, మధ్యప్రదేశ్‌లో ఈ నెల 1వ తేదీ నాటికి రూ.226 కోట్లు, మిజోరంలో గత నెల 25వ తేదీ నాటికి రూ.36 కోట్లు, రాజస్థాన్‌లో గత నెల 24వ తేదీ నాటికి రూ.214 కోట్ల విలువైన వస్తువులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలో ఈ నెల 2వ తేదీ నాటికి అత్యధికంగా రూ.439 కోట్ల నగదు, మద్యం తదితరాలన అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.156 కోట్ల నగదు ఉండగా రూ. 165.2 కోట్ల విలువైన 1,300 కిలోల బంగారం, వెండి, ఇతర లోహాలు, రూ.49.4 కోట్ల విలువైన మద్యం, రూ.24.7 కోట్ల విలువైన గంజాయి ఉంది. ఆదాయపన్ను శాఖ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ బృందాలను నియమించి, విస్తృతంగా తనిఖీలు జరుపుతోంది. విమానాశ్రయాల వద్ద ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్లు పనిచేస్తున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో పట్టుబడిన నగదు, ఇతర వస్తువుల విలువ కేవలం రూ.137 కోట్లు మాత్రమే. ఇందులో రూ.125 కోట్ల నగదు ఉంది.

మోడీ ఏం చేశారని మళ్లీ కావాలి

- పవన్‌కు సిపిఎం సూటి ప్రశ్న

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, రంపచోడవరం విలేకరి

మోడీ మూడోసారి ప్రధాని కావాలని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన ప్రకటనపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారక్షణ భేరి బస్సు యాత్రలో భాగంగా ఆదివారం రంపచోడవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మోడీ మూడోసారి ప్రధాని కావాలని పవన్ కల్యాణ్ చేసిన ప్రకటనపై స్పందిస్తూ, రాష్ట్రానికి అన్యాయం చేసినందుకా? విభజన హామీలు అమలు చేయనందుకా? స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టినందుకా? వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు నిలిపివేసినందుకా? మళ్లీ మోడీ ప్రధాని కావాలని పవన్ కోరుకుంటున్నారు అని ప్రశ్నించారు. మోడీ ఎందుకు మళ్లీ ప్రధాని కావాలని పవన్ కోరుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఎవరిని ఉద్ధరించడానికి మోడీ మూడోసారి ప్రధాని కావాలని ప్రశ్నించారు. బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు నాలుగు స్తంభాలాట ఆడుతూ ప్రజలను మోసగిస్తున్నాయని విమర్శించారు. ఈ ఆటలో బిజెపి సూత్రధారి కాగా, మిగిలిన మూడు పార్టీలూ పాత్రధారులుగా ఉన్నాయన్నారు. స్వతంత్రను కోల్పోయి బిజెపి ప్రాపకం కోసం రాష్ట్రంలోని మూడు పార్టీలూ పాకులాడుతున్నాయని విమర్శించారు. సొంత రాజకీయ అజెండా కోసం రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్నాయన్నారు. మోడీని మోసినంత వరకూ రాష్ట్రం అభివృద్ధి జరగదని తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి వైసిపి ప్రభుత్వ మద్యం కుంభకోణంపై లెటర్ రాయడంపై శ్రీనివాసరావు స్పందిస్తూ, బిజెపి సర్కారు జగన్‌కు బెయిల్ రద్దు చేసి ప్రభుత్వ అవినీతి, కుంభకోణాలపై ఎందుకు విచారించడం లేదో ప్రజలకు ఆమె వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భూకబ్జాల పాలన

- రాష్ట్రాన్ని అదానీకి దోచిపెడుతున్నారు
- విభజన హామీలకు కేంద్రం తిలోదకాలు
- 'ప్రజారక్షణ భేరి' యాత్రలో గఫూర్



తిరుపతి జిల్లా రేణిగుంటలో ఎస్‌సిల గోడు వింటున్న ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో భూకబ్జాల పాలన సాగుతోందని, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అవకాశవాద అబద్ధాల ప్రభుత్వాలు రాజ్యమేలుతున్నాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ విమర్శించారు. సిపిఎం నిర్వహిస్తోన్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర ఆదివారం తిరుపతి జిల్లా రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా సర్వేపల్లి మీదుగా ముత్తుకూరు వరకూ సాగింది. యాత్ర బృందానికి అడుగడుగునా వివిధ తరగతుల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభల్లో గఫూర్ మాట్లాడుతూ విభజన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చని అవకాశవాద, అరాచక కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి, జనసేన పార్టీలు సాగిలపడుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నాయని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వారి అనుయాయులు ప్రభుత్వ, ప్రయివేటు భూములను ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. పేదలు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా, వారిని అక్కడి నుంచి బలవంతంగా వెళ్లగొడుతోందని అన్నారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే అధికార పార్టీ కంటే ముందు పోలీసులే ఓవర్ యాక్షన్ చేస్తూ వైసిపి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చిన్నచిన్న తాయిలాలు ఇస్తూ కార్పొరేట్ శక్తులకు వేలాది కోట్ల రూపాయలు కట్టబెడుతున్నారని విమర్శించారు. కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అదానీ పరం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని అదానీకి దోచిపెడుతున్నారని అన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఎక్కడా అమలు కావడం మిగతా 2లో

కర్నూలులో డిసెంబర్ 15 నుంచి
కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు


- తిక్కారెడ్డి అధ్యక్షతన ఆహ్వాన సంఘం ఏర్పాటు

3

సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలి

- పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి
- ప్రజారక్షణ భేరి డిమాండ్
- రంపచోడవరం ఏజెన్సీలో ఉత్సాహంగా బస్సు యాత్ర

2



హాంబర్గ్ విమానాశ్రయంలో కాల్పులు

- నిలిచిన వందకుపైగా విమానాలు
- దుండగుడి లొంగుబాటు

బెర్లిన్ : జర్మనీలోని హాంబర్గ్ విమానాశ్రయంలో ఓ దుండగుడు కాల్పులు జరపడంతో, ఆ విమానాశ్రయాన్ని అధికారులు ఆదివారం మూసివేశారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా తరలించారు. 18 గంటల తరువాత దుండగుడిని అరెస్టు చేసి, అతని నాలుగేళ్ల కుమార్తెను రక్షించారు. జర్మనీలోని న్యూస్‌పోర్టల్ ఎన్‌డిఆర్ తెలిపిన వివరాల ప్రకారం తన కుమార్తెను తీసుకుని 35 ఏళ్ల దుండగుడు ఆదివారం తెల్లవారుజామున 2గంటల సమయంలో కారుతో సెక్యూరిటీ గేట్లను ఢీకొట్టి విమానాశ్రయంలోకి ప్రవేశించాడు. తుపాకీతో గాల్లోకి రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. వాహనంలో నుంచి రెండు సీసాలకు నిప్పంటించి బయటకు విసిరాడు. తన కుమార్తెను కారులో ఉంచి, ఓ విమానం కింద పార్క్ చేశాడు. ఎయిర్‌పోర్ట్ అధికారులు ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి తరలించడంతోపాటు ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. టర్కిష్ ఎయిర్‌లైన్స్ విమానంతోపాటు ఇతర విమానాలను అక్కడి నుంచి ఖాళీ చేయించారు. వందకుపైగా విమానాలను ముందుజాగ్రత్త చర్యగా రద్దు చేశారు. దీంతో, మూడు వేల మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తన కుమార్తెను బలవంతంగా లాక్కుని తీసుకెళ్లిపోయాడని దుండగుడి భార్య పోలీసులకు ఫోన్ చేసి చెప్పింది. దుండగుడితోపాటు చిన్నారి ఉండటంతో ఓ సైకాలజిస్టు ద్వారా పోలీసులు చర్చలు జరపగా, నిందితుడు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు.

సిపిఎం తెలంగాణ తొలి జాబితా

14 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 14 నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న అభ్యర్థులతో సిపిఎం తొలి జాబితా ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. మరో మూడు స్థానాలకు అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. పార్టీ ఎన్నికల ప్రణాళిక విడుదల చేసిన అనంతరం తమ్మినేని మాట్లాడుతూ, ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. సిపిఎం అభ్యర్థులను ఆదరించి, ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సిపిఎంకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉంటేనే కార్మికుల, రైతుల, వ్యవసాయ కార్మికుల, మహిళల, అన్ని తరగతుల ప్రజల హక్కులూ కాపాడబడతాయని చెప్పారు. తెలంగాణలో బిజెపిని ఒక్క స్థానంలో కూడా గెలవనీయమని చెప్పారు. సిపిఎం పోటీ చేయని స్థానాల్లో బిజెపిని ఓడించే పార్టీలకు మద్దతిస్తామని తెలిపారు.



అభ్యర్థులు

1) భద్రాచలం : కారం పుల్లయ్య
2) అశ్వారావుపేట : పిట్టల అర్జున్
3) పాలేరు : తమ్మినేని వీరభద్రం
4) మధిర : పాలడుగు భాస్కర్
5) వైరా : భూక్యా వీరభద్రం
6) ఖమ్మం : యర్రా శ్రీకాంత్
7) సత్తుపల్లి : మాచర్ల భారతి
8) మిర్యాలగూడ: జూలకంటి రంగారెడ్డి
9) నకిరేకల్ : బొజ్జ చిన్న వెంకులు
10) భువనగిరి : కొండమడుగు నర్సింహ
11) జనగాం : మోకు కనకారెడ్డి
12) ఇబ్రాహీంపట్నం : పగడాల యాదయ్య
13) పఠాన్‌చెరు : జె.మల్లికార్జున్
14) ముషీరాబాద్ : ఎం దశరథ్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ నరమేధం ఆపాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

పాలస్తీనాపై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తోన్న నరమేధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ ఆదివారం విశాఖ నగరంలో వామపక్ష, పౌర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వందలాది మందితో శాంతి ర్యాలీ జరిగింది. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సభ నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి నిర్ణయాలకు అనుగుణంగా పాలస్తీనా భూభాగాల నుంచి ఇజ్రాయిల్ పూర్తిగా వైదొలగాలని, భారత ప్రభుత్వం తటస్థ వైఖరిని విడనాడి పాలస్తీనా ప్రజలకు సంపూర్ణ మద్దతు ప్రకటించి, సహాయ సహకారాలు అందించాలని నినదించారు. సభలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జెవి.సత్యనారాయణమూర్తి, మానవ హక్కుల వేదిక ప్రతినిధి విఎస్.కృష్ణ మాట్లాడుతూ అమెరికా మద్దతుతోనే పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ అత్యంత భయానకమైన దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. యుద్ధ నియమాలకు వ్యతిరేకంగా నివాస ప్రాంతాలపైనా, చివరికి ఆస్పత్రులపైనా, స్కూళ్లపైనా దాడులు చేస్తోందన్నారు. యుద్ధ బాధిత ప్రజలకు యుఎన్‌ఒ సహాయక చర్యలను సైతం అడ్డుకుంటోందని తెలిపారు. అమెరికా తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం ఇజ్రాయిల్‌ను పూర్తిగా బలపరుస్తోందని విమర్శించారు. మధ్యప్రాచ్యంలో తమ ఆధిపత్యాన్ని పూర్తిగా నెలకొల్పుకునేందుకు ఇజ్రాయిల్‌ని అమెరికా, బ్రిటన్‌లు సృష్టించాయన్నారు. అక్కడున్న ఆయిల్ వనరులను కాజేయడానికి, మధ్యప్రాచ్య దేశాల్లోని పాలకులను లోబర్చుకోవడానికి, వ్యూహాత్మకంగా పట్టు సాధించడానికి ఇజ్రాయిల్‌ను ఉపయోగించుకుంటూ ఒక టెర్రరిస్టు దేశంగా అమెరికా మార్చేసిందని విమర్శించారు. ప్రపంచంలోని పౌర సమాజమంతా ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని ఖండిస్తున్నప్పటికీ ఆ దేశం వెనక్కు తగ్గకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో విశాఖలోని పౌర ప్రజా సంఘాలు, భారత్ బచావో సంస్థ, జర్నలిస్టు, ముస్లిం మిత్ర సంఘాలు భాగస్వామ్యమయ్యాయి. పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు శరత్ కుమార్, జుబేర్, అరుణ, పి.చంద్రశేఖర్, రెహమాన్, ఎం.వెంకటేశ్వర్లు, కె.నిర్మల, ఇ.లక్ష్మి, ఎమ్‌డి షరీఫ్, నజీర్ అహ్మద్, రాధ, పుష్ప, మధు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో భారీ శాంతి ర్యాలీ



స్వాతంత్ర్య సమరయోధుడికి 40 ఏళ్ల తర్వాత పింఛన్

- కేంద్ర ప్రభుత్వ తీరుపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం
- రూ.20,000 జరిమానా

న్యూఢిల్లీ : భారత స్వాతంత్ర్య సమరయోధుడు ఉత్తమ్ లాల్ సింగ్(96) తన పెన్షన్ కోసం దాదాపు నాలుగు దశాబ్దాల పాటు నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలతో ఆయనకు పింఛన్‌కు మార్గం సుగమమైంది. ఇది "విచారకరమైన పరిస్థితి" అని కోర్టు పేర్కొన్నది. భారత ప్రభుత్వం తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ విషయంలో కేంద్రానికి న్యాయస్థానం రూ.20,000 జరిమానా విధించింది. స్వాతంత్ర్య సమరయోధుల పట్ల వ్యవహరిస్తున్న తీరు, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడి పట్ల భారత ప్రభుత్వ తీరు బాధాకరమని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. "1980 సంవత్సరం నుంచి సింగ్ స్వాతంత్రత సైనిక్ సమ్మాన్ పెన్షన్‌ను సంవత్సరానికి 6 శాతం వడ్డీతో 12 వారాల్లోగా విడుదల చేయాలి" అని కేంద్రాన్ని అందులో ఆదేశించారు. అంతేకాకుండా, కేంద్రంపై కోర్టు రూ. 20,000 జరిమానా విధించింది. 1985లో బీహార్ ప్రభుత్వం సిఫారసు చేసిన పిటిషనర్ కేసులో భాగమైన సింగ్ పత్రాలను కేంద్రం కోల్పోయిందని కోర్టు పేర్కొన్నది. 1927లో జన్మించిన సింగ్ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. అతను బ్రిటీష్ ప్రభుత్వంచే నిందితుడిగా చేయబడ్డారు. అతను 1982, మార్చిలో స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2017 నవంబర్‌లో హోం మంత్రిత్వ శాఖ తన వద్ద సింగ్ రికార్డులు లేవని బీహార్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ కేసును అధికారులు పరిష్కరించకపోవడంతో సింగ్ హైకోర్టును ఆశ్రయించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య స్తూపం వద్ద నివాళ్లర్పిస్తున్న వి.శ్రీనివాసరావు తదితరులు



చింతూరులో గిరిజన సంప్రదాయ విల్లంబులు ఎక్కుపెట్టిన వి.శ్రీనివాసరావు తదితరులు

సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలి

- పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి
- ప్రజారక్షణ భేరి డిమాండ్
- రంపచోడవరం ఏజెన్సీలో ఉత్సాహంగా బస్సు యాత్ర

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, రంపచోడవరం విలేకరి

అల్లూరి సీతారామరాజు జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి కనీస సదుపాయాలు కల్పించాలని ప్రజారక్షణ భేరి డిమాండ్ చేసింది. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణభేరి బస్సు యాత్ర ఏడో రోజుకు చేరింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి, చింతూరు, విఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలం తోటపల్లిల్లో ఆదివారం జరిగిన బహిరంగ సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. అడవిలోని వనరులు, ఖనిజాలు, భూమిపై ప్రభుత్వానికి ప్రేమ తప్ప, గిరిజనులపై లేదన్నారు. అటవీ సంరక్షణ చట్టాన్ని సవరించి గిరిజనుల చేతిలోని భూములను, సహజ సంపదను లాక్కొని అదానీ వంటి వ్యక్తులకు కట్టబెట్టాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం తెస్తోన్న గిరిజన వ్యతిరేక చట్టాలకు వైసిపి, టిడిపి మద్దతు ఇస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. సిపిఎం ఎమ్మెల్యేలు ఉన్న కాలంలో తప్ప, ఆ తరువాత విలీన మండలాల్లో అభివృద్ధి జరగలేదని అన్నారు. గిరిజన ప్రాంతంలోని వనరుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలని, గిరిజన హక్కులను పరిరక్షించుకోవాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. పునరావాసం పూర్తి స్థాయిలో కల్పించే వరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పునరుద్ధరించాలని, పోలవరం ప్రాజెక్టు లీకేజీలపై న్యాయ విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని, ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డిఎస్‌సి నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, భాషా వలంటీర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పునరావాసం సాధన కోసం నిర్వాసితులంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, అశోక్, రాష్ట్ర నాయకులు ఎం సూర్యనారాయణ, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజంగా సాగిన యాత్ర... అమరులకు నివాళి

రంపచోడవరం ఏజెన్సీలో ప్రజారక్షణ భేరి యాత్ర ఉత్తేజంగా సాగింది. విఆర్.పురం మండలం చొప్పల్లి గ్రామం వద్ద ప్రజలు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి యాత్రా బృందం బైకు ర్యాలీగా సున్నంవారి గూడేనికి చేరుకుంది. అక్కడ సిపిఎం మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు సున్నం రాజయ్య స్తూపం వద్ద వి.శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. చింతూరులో సిపిఎం నాయకులు బత్తుల భీష్మారావు వర్ధంతి కార్యక్రమంలో యాత్రా బృందం పాల్గొంది. ఆయన స్మారక స్తూపం వద్ద నివాళ్లర్పించింది. మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, మల్లుదొర, గంటం దొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

రంపచోడవరం ప్రత్యేక జిల్లా

- వి శ్రీనివాసరావు డిమాండ్

రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలను కలిపి నూతన జిల్లా ఏర్పాటు చేయాలని వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కొత్త జిల్లా ఏర్పాటుపై ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజారక్షణ భేరి బస్సు యాత్రలో భాగంగా ఆదివారం ఆయన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్‌తో కలిసి రంపచోడవరంలో విలేకరులతో మాట్లాడారు. రంపచోడవరం నియోజకవర్గంలోని ప్రజలు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరుకు వెళ్లాలంటే రహదారి, రవాణా సౌకర్యం సరిగా లేవన్నారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన అల్లూరి జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. వందల కోట్లు ఖర్చు చేసి జాతీయ రహదారి నిర్మిస్తోన్న ప్రభుత్వం... గిరిజన గ్రామాలకు రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించకపోవడం విచారకరమన్నారు. ఏజెన్సీలో జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించకుండా పనులు చేపట్టడం సరికాదని తెలిపారు. అల్లూరి పేరుకు అపచారం చేసే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఏజెన్సీలో జగనన్న ఇళ్ల నిర్మాణాలకు ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రుల్లో సరిపడా వైద్య సిబ్బంది లేక కాకినాడ, విశాఖపట్నం ఆస్పత్రులకు రోగులు వెళ్లాల్సిన దుస్థితి ఉందని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న సాధారణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఏజెన్సీలో అమలు కావడం లేదన్నారు. కాఫీ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఎకరాకు లక్ష రూపాయల ఆదాయం రావాల్సిన రైతుకు రూ.40 వేలు మించి రావడం లేదని తెలిపారు. ప్రయివేటు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను దోచుకుంటున్నారన్నారు. పోలవరం నిర్వాసితులకు ప్రస్తుత రేట్ల ప్రకారం పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో వనరులను కొల్లగొట్టుకుపోవడాన్ని పోరాటాలతో అడ్డుకుంటామన్నారు. బాక్సైట్ తవ్వకం కోసం, హైడల్ పవర్ ప్రాజెక్టులను అదానీకి అప్పగించడం కోసం జరుగుతున్న ప్రయత్నాలను సాగనివ్వబోమని తేల్చి చెప్పారు.



అనకాపల్లిలో జరిగిన భారీ ప్రదర్శనలో లోకనాథం, తదితరులు

దేశాన్ని అమ్మే హక్కు మోడీకి ఎవరిచ్చారు ?

- బిజెపితో ప్రజలకు నష్టం
- పరవాడ రాంకీ కాలుష్యంతో ప్రజలకు ముప్పు
- ప్రజారక్షణభేరిలో కె లోకనాథం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/కాకినాడ ప్రతినిధి

దేశంలోని బ్యాంకులు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, గాలి, నీరు.. ఇలా దేశం మొత్తాన్ని అదానీ. అంబానీ వంటి కార్పొరేట్లకు అమ్మే హక్కు ప్రధాని మోడీకి ఎవరిచ్చారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ప్రశ్నించారు. బిజెపితో ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. సిపిఎం ఆధ్వర్యాన జరుగుతున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర ఆదివారం అనకాపల్లి జిల్లా లంకెలపాలెంలో ప్రారంభమై పరవాడ, అచ్యుతాపురం, అనకాపల్లి, ఎస్.రాయవరం, మీదుగా కాకినాడ జిల్లా తుని, పిఠాపురం, కాకినాడకు చేరుకుంది. యాత్రా బృందానికి స్థానికంగా ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న ఫార్మా కాలుష్యంపైనా, కనీస సదుపాయాలలేమిపైనా, విద్యుత్ భారాలపైనా వినతులు సమర్పించారు. యాత్ర ఆద్యంతం ఆశాలు, అంగన్‌వాడీలు, విఒఎలు, మధ్యాహ్న భోజన కార్మికులు, జీడి పిక్కల పరిశ్రమ కార్మికులు, ఇతర స్కీం వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా చోట్ల ఏర్పాటు చేసిన సభల్లో కె.లోకనాథం మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రంలో మోడీ పాలన సాగుతోందన్నారు. రాష్ట్రాలు, ప్రాంతాల మధ్యే కాకుండా మత సామరస్యంతో జీవించే మనుషుల మధ్య కూడా చిచ్చుపెడుతోందని తెలిపారు.

విభజన హామీలను నెరవేర్చకున్నా, నిత్యావసర సరుకుల ధరలను పెంచేస్తున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. పరవాడ రాంకీ ఫార్మా కంపెనీ కాలుష్యంతో స్థానిక ప్రజల ఉపాధికి తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. కాలుష్యంతో పరవాడలోని పెదచెరువు ఎలా నాచు పట్టికుపోయిందో వివరించారు. పరవాడ వాసులు కాలుష్యంతో జీవిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి పట్టదా? అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాకినాడ వంటి నగరాల్లో పట్టణ సంస్కరణలను అమలు చేస్తూ.. చెత్త, ఇంటి పన్నులు భారీగా పెంచి ప్రజలపై మోయలేని భారాలను మోపుతున్నాయన్నారు. కాకినాడ నగరంలో పాలకులు భూ కబ్జాలు చేస్తున్నారని విమర్శించారు. జూనియర్ కళాశాల స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసమే యాత్రలు చేపట్టినట్లు తెలిపారు. లంకెలపాలెం జంక్షన్ వద్ద సభలో పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రాంకీపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులందరికీ రూ.లక్షలు లంచాలు కవర్లలో అందడమే కారణమని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. కార్పొరేట్లకు తొత్తుగా వ్యవహరిస్తోన్న బిజెపితో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు జతకట్టడం సరికాదన్నారు. బిజెపి అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. యాత్రలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి, బి.ప్రభావతి, హరిబాబు, అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, డి.వెంకన్న, ఎం.అప్పలరాజు, సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సీనియర్ నాయకులు దువ్వాశేషబాబ్జి, జి.బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఇప్పట్లో హైపర్‌లూప్ రైళ్లు లేనట్లే

- నీతి ఆయోగ్ సభ్యుడు వికె సారస్వత్

న్యూఢిల్లీ : సమీప భవిష్యత్తులో దేశంలో అత్యంత వేగంతో నడిచే హైపర్‌లూప్ రైళ్లను ప్రవేశపెట్టే అవకాశం లేదని నీతి ఆయోగ్ సభ్యుడు వికె సారస్వత్ చెప్పారు. ఈ రైళ్ల ప్రత్యేకత ఏమంటే ఇవి ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. రవాణాకు సంబంధించిన మౌలిక సదుపాయాలపై పర్యావరణ ప్రభావం కూడా తగ్గుతుంది. ఇవి బులెట్ రైళ్ల కంటే వేగంగా ప్రయాణిస్తాయి. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని వీటిని తయారు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇవి ఆర్థికంగా ప్రయోజనకరం కావని సారస్వత్ తెలిపారు. హైపర్‌లూప్ పరిజ్ఞానం వాణిజ్యపరంగా లాభదాయకమా? కాదా? అనే విషయాన్ని అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీకి సారస్వత్ నాయకత్వం వహిస్తున్నారు. 'విదేశాలలో మాదిరి హైపర్‌లూప్ పరిజ్ఞానం మనకు ఆర్థికంగా ప్రయోజనకరం కాదు. ఈ పరిజ్ఞానం పరిణితి చాలా తక్కువ స్థాయిలో ఉంది' అని ఆయన ఆదివారం ఓ వార్తా సంస్థకు చెప్పారు.

మెడికల్ బెయిల్‌కు చంద్రబాబు అనర్హుడు

- ఎపిక్ ఫోరం సదస్సులో అడ్వకేట్లు, మేధావులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మెడికల్ బెయిల్ కండీషన్లు ఉల్లంఘిస్తున్నారని, బెయిల్‌కు ఆయన అనర్హుడని అడ్వకేట్లు, మేధావులు అభిప్రాయపడ్డారు. వివక్షతో కూడిన బెయిళ్లపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం ఎపి ఇంటిలెక్చువల్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఎపి ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వివిఆర్ కృష్ణంరాజు అధ్యక్షతన సదస్సు జరిగింది. సదస్సులో ఎపిక్ ఫోరం ఛైర్మన్ పి విజయబాబు మాట్లాడుతూ.. చంద్రబాబు నిజాయతీని నిరూపించుకోకుండా వైద్యం పేరుతో బెయిల్ పొంది.. షరతులు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం చట్టంలో లొసుగులు వాడుకుందంటూ పురందేశ్వరి ప్రకటన హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశంలో 4,442 మంది రాజకీయ నాయకులపై కేసులు పెండింగ్‌లో ఉంటే, వాటిలో అత్యధికం బిజెపి నాయకులపైనే ఉన్నాయన్నారు. వివిఆర్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. ప్రొఫెసరు సాయిబాబా వంటి వికలాంగులను సైతం ఏళ్ల తరబడి బెయిల్ ఇవ్వకుండా జైళ్లలో ఉంచి, తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులకు వెంటనే బెయిల్ వస్తుందన్నారు. ఈ సదస్సులో అడ్వకేట్లు పిళ్లా రవి, ఎన్ శ్రీహరి, ఎమ్ విఠల్‌రావు, ధనలక్ష్మి, ఎ జ్యోతి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాల పాలన

(మొదటి పేజీ తరువాయి)

లేదని తెలిపారు. కృష్ణపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. రాయలసీమ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కరువు విలయతాండవం చేస్తోన్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. మోడీకి సాగిలబడితే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడదని, తిరగబడి ఉద్యమిస్తేనే రాష్ట్ర హక్కులను కాపాడుకోగలమని తెలిపారు. జగన్ ప్రభుత్వం పూర్తిగా ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రానికి పన్ను రాయితీ వెసులుబాటు కలిగి కొత్తగా పరిశ్రమలు, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ వచ్చేవన్నారు. పరిశ్రమలు రాక, ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక ఎంఎ, బిఇడి చేసిన యువత చివరకు ఆటోలు నడుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. దీనికి కారణం కేంద్రం కాదా? అంటూ ప్రశ్నించారు. ప్రజలు తమ హక్కుల కోసం పోరాడకపోతే మరింత ప్రమాదంలో పడతారన్నారు.

ఎన్నికల కోసమో, ఓట్ల కోసమో ఈ యాత్రను సిపిఎం చేపట్టలేదని, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రజలను చైతన్యపరచడానికి ఈ యాత్ర సాగిస్తోందని తెలిపారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. ఈ యాత్రలో సిపిఎం రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు, ఎం.భాస్కరయ్య, దయా రమాదేవి, నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేను సంతోషంగానే ఉన్నా !

- బాధితుడయ్యానంటూ దుష్ప్రచారం తగదు
- ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రస్తుత ప్రభుత్వ హాయంలో తాను చాలా సంతోషంగా ఉన్నానని, తనకు, ప్రభుత్వానికి మధ్య అగాధం సృష్టించేందుకు కొందరు దుష్ప్రచారం చేయడం తగదని ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 2న బహుజన రిసోర్స్ సెంటర్ నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యానని, ఆ సందర్భంగా మాట్లాడుతూ 'ఎస్‌సిలందరిలాగే అదే కులంలో పుట్టిన తాను కూడా బాధితుడినే' అని తాను చెప్పిన మాటలను ఈ ప్రభుత్వ హాయంలో బాధితుడైనట్లుగా కొందరు వక్రీకరించారని విక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వానికి తనను దూరం చేయాలనే కుట్రతో ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని వాపోయారు. ఈ ప్రభుత్వంలో తాను చాలా సంతోషంగా ఉన్నానని, లేనిపోని అభాండాలు వేయడం సరికాదని అన్నారు. ఈ తప్పుడు ప్రచారానికి తెర లేపి ట్విట్టర్‌లో పోస్టు పెట్టిన నాయకుడు తన ముందుకొచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. పార్టీలకతీతంగా అందరికీ న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాతీయ రహదారి బాధిత ఆదివాసీలకు నష్టపరిహారం ఇప్పించాలి

- సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ రహదారి నెంబరు 516ఇ విస్తరణ కోసం ధ్వంసం చేసి, స్వాధీనం చేసుకున్న భూములకు సంబంధించి ఆదివాసీలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. విజయనగరం నుంచి రాజమండ్రి వరకు జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 156ఇ) నిర్మాణానికి ప్రభుత్వం అనుమతినిచ్చిందని, దీనికోసం అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, జి మాడుగుల, జికెవీధి, కొయ్యూరు, రాజవొమ్మంగి మొత్తం 11 మండలాల్లో రహదారి నిర్మాణ పనులను గుత్తేదారు ప్రారంభించి 30 శాతం పూర్తి చేశారని తెలిపారు. ముఖ్యంగా జిరాయితీ పట్టా భూమి, అటవీ పోడు భూములు కలిపి సుమారు 50 ఎకరాలు రహదారికి ఇరువైపులా ధ్వంసం చేశారని, ఆదివాసీలకు అటవీ పోడు భూములే ప్రధానమైన జీవనాధారమని పేర్కొన్నారు. కాఫీ తోటలు, వరి, రాజ్‌మా చిక్కుడు, పసుపు పంట సుమారు 1500 మంది సాగుచేస్తున్నారని తెలిపారు. 2005వ సంవత్సరానికన్నా ముందు అటవీ ప్రాంతంలో జీవిస్తున్న, సాగుచేస్తున్న ఆదివాసీలకు వ్యక్తిగత, ఉమ్మడి అటవీ యాజమాన్యపు హక్కును కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేని అన్నారు. పదెకరాలకు తక్కువ లేకుండా వ్యక్తిగత అటవీహక్కు పత్రాలు జారీచేయాల్సిన అధికారులు హక్కు పత్రాలు లేవని మాయమాటలు చెప్పి బలవంతంగా లాక్కొన్నారని, తాగునీరు పైపు, గ్రామ ఆలయాన్ని కూడా ధ్వంసం చేశారని వివరించారు. జికెవీధి మండలం, పెదవలస పంచాయతీ (4), సంకడ పంచాయతీ (6), రింతాడ పంచాయతీ (4) గ్రామాల్లో వున్న స్థానిక ఆదివాసీలు జాతీయ రహదారి నిర్మాణంలో సాగు భూమి కోల్పోయినా.. వారికి నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని సిపిఎం నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరి బృందానికి ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రాలు సమర్పించారని తెలిపారు. 5వ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గ్రామాల్లో భూసేకరణకు ఆదివాసీ గ్రామసభ (పీసా) అభిప్రాయం, ఆమోదమూ తీసుకోలేదని వివరించారు. అటవీహక్కుల కమిటీ (ఎఫ్ఆర్‌సి) తీర్మానమూ లేకుండా వందలాది ఎకరాల కాఫీ తోటలు, పచ్చని చెట్లను కూడా తొలగిస్తున్నారని పేర్కొన్నారు. కనీసం రహదారి నిర్మాణ బాధితుల జాబితా వివరాలనూ పంచాయతీ, సచివాలయం కేంద్రంలో ప్రదర్శించలేదని లేఖలో తెలిపారు. అమాయక ఆదివాసీలపై దౌర్జన్యానికి పాల్పడిన ఎన్‌హెచ్516ఇ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు అటవీహక్కుల చట్టం ప్రకారం పోడు వ్యవసాయానికి భూమి కేటాయించాలని, తక్షణమే గ్రామసభ నిర్వహించి బాధితుల జాబితాను ప్రకటించి 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం మంజూరు చేయాలని, బాధిత ఆదివాసీలకు న్యాయం జరిగేట్లు చూడాలని కోరారు.



అభివాదం చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

'ఉక్కు' పరిరక్షణకు సిఎం చొరవ చూపాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయమై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపాలని, రాష్ట్రంలోని అఖిలపక్ష రాజకీయ పార్టీలను, కార్మిక సంఘాలను ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకునేటట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8వ తేదీ నాటికి ఉక్కు పరిరక్షణ దీక్షలు వెయ్యి రోజులకు చేరుతున్న నేపథ్యంలో కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం వద్ద ఆదివారం నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ.. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఇప్పటికే రాష్ట్రంలోని రాజకీయ పక్షాలకు అనేక విజ్ఞప్తులు చేశామని, వారి నుంచి అంతంత మాత్రంగానే స్పందన లభించిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు, విద్యార్థులు మాత్రం తమ పోరాటానికి ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్రం వెనక్కి తగ్గిన విషయాన్ని గుర్తుచేశారు. అది ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒత్తిడితోనే సాధ్యమైందని తెలిపారు. ఆ దిశగా జగన్‌మోహన్‌రెడ్డి కూడా చొరవ చూపాలని కోరారు. మరో కో - కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వాలపై కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని కోరారు. సమావేశంలో పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, నాయకులు కారు రమణ, యు.రామస్వామి, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



లింక్ ఛానల్ గేట్ల వద్ద రైతులు

25 వేల ఎకరాల్లో ఎండుతున్న పంటలు

- లింక్ ఛానల్ గేట్లు ఎత్తి నీళ్లు వదులుకున్న రైతులు
- ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ప్రజాశక్తి- నంద్యాల రూరల్

నంద్యాల మండలంలో పంటల సాగు కోసం కెసి కెనాల్ నుండి విడుదల చేస్తున్న నీరు పంట పొలాలకు సరిపోకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో, రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. కెసి కెనాల్ నూనెపల్లె ఛానల్ కింద ఉన్న ఆయకట్టు రైతులు కాల్వ వద్దకు ఆదివారం భారీగా చేరుకుని గేట్లు ఎత్తారు. తమ పంట పొలాలు తడిసేంత వరకు ఇక్కడి నుండి వెళ్లేది లేదని అక్కడే కూర్చున్నారు. నంద్యాల మండలంలోని కెసి కెనాల్ నూనెపల్లె ఛానల్ కింద ఉన్న పొన్నాపురం, గాంధీనగర్, మూలసాగరం, చాబోలు, రైతు నగరం, చాపిరేవుల, సుబ్బారెడ్డి పాలెం, కానాల, పాండురంగాపురం, మిట్నాల, బ్రాహ్మణపల్లె, ఎ.శివరామపురం, బి.శివరామపురం, పుసులూరు, చింతకుంట్ల, జునేపల్లి, పసురపాడు, గోస్పాడు, తేళ్లపురి తదితర 20 గ్రామాలకు సంబంధించి దాదాపు 25 వేల ఎకరాలకు ఈ ఛానల్ కింద ప్రతి రోజూ 150 క్యూసెక్కుల సాగు నీరు ఇవ్వాలి. కానీ, ఈ ఏడాది వర్షాలు సరిగా లేకపోవడంతో ప్రాజెక్టులలో నీరులేక 30 నుండి 40 క్యూసెక్కులు మాత్రమే వదులుతున్నారు. ఈ నీరు పాండురంగాపురం గ్రామం దాటి దిగువ గ్రామాలకు చేరకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. వదిలిన నీటిలో కొంత శ్రీశైలం ఎమ్మెల్యే వేసిన వెంచర్‌లో కట్టడాలకు తరలించుకుపోతున్నట్లు ఆరోపించారు. కళ్లేదుటే పంటలు ఎండిపోతుండడంతో కడుపు మండిన ఆయా గ్రామాల రైతులు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, కార్లలో ఆదివారం నంద్యాలలోని పొన్నాపురం దగ్గర ఉన్న కెసి కెనాల్ వద్దకు తరలివచ్చారు. మెయిన్ కెసి కెనాల్ కాల్వకు ఉన్న గేట్లు మూసివేశారు. అనంతరం నూనెపల్లె ఛానల్ కాల్వ గేట్లను ఎత్తి తమకు రావాల్సిన 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకున్నారు. విషయం తెలిసిన వైసిపి నాయకుడు ఆదిరెడ్డి అక్కడికి చేరుకొని 'మీరే అన్ని నీళ్లు తీసుకెళ్తే... మెయిన్ కెనాల్ కింద ఉన్న దిగువ ప్రాంతం వాళ్లకు నీరెలా' అంటూ ప్రశ్నించాడు. దీంతో, రైతులకు, ఆయనకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. తమ పొలాలు తడిసేంతవరకు నీరు వదిలే సమస్య లేదంటూ రైతులు కట్టపైనే ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆదిరెడ్డిని అక్కడి నుండి పంపించేశారు. కెసి కెనాల్ కింద సాగునీరు వస్తుందనే ఆశతో రైతులు 25 శాతం విస్తీర్ణంలో వరి, దిగువ గ్రామాలలో పది శాతం మిరప, 15 శాతం మినుము, 50 శాతం జొన్న పంటలు వేశారు. విత్తనం వేసింది మొదలుకొని ఈ రోజు వరకు సరిగ్గా నీరు రాక పంటలన్నీ ఎండిపోతున్నాయని, నీరు అందించాలని నంద్యాల ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్‌రెడ్డిని రెండు రోజుల క్రితం మిట్నాల రైతులు కలిసి విన్నవించారు. అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి నీటిని విడుదల చేయించారు. అయితే, వదిలిన నీరు చాలా తక్కువగా ఉండడంతో దిగువ పొలాలకు అందలేదు. దీంతో, దిగువ ప్రాంత రైతులు ఆగ్రహించి కట్ట వద్దకు చేరుకుని గేట్లు ఎత్తారు.



సబితా ఇంద్రారెడ్డితో ఫాజిల్ (ఫైల్)

మంత్రి సబితా ఇంద్రారెడ్డి గన్‌మెన్ ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గన్‌మెన్ ఆదివారం గన్‌తో పేల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంత్రి గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎఎస్‌ఐ ఫాజిల్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారి వివాహాల సమయంలో ఆయన బ్యాంకు లోన్లు తీసుకున్నారు. అవి తీరకముందే బ్యాంక్ ఆఫ్ బరోడాలో రుణం కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ఉన్న లోను క్లియర్ చేస్తే రూ.పది లక్షల లోన్ ఇస్తామని చెప్పి బ్యాంకు వాళ్లు రూ.మూడు లక్షలు కట్టించుకున్నారు. ఆ తర్వాత మీకు సర్వీస్ తక్కువగా ఉందని, లోనివ్వడం కుదరదని బ్యాంకు సిబ్బంది తేల్చి చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన ఫాజల్ హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని మణికంఠ హోటల్‌లో తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ప్రసాద్, ఎస్‌ఐ చంద్రశేఖర్ పోలీసు ఉన్నతాధికారులు ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జనసేన, టిడిపి ఉమ్మడి కార్యాచరణ

- వైసిపి అవినీతిపై ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

క్షేత్రస్థాయిలో ఉమ్మడి కార్యాచరణ దిశగా జనసేన, టిడిపి అడుగులు వేస్తున్నాయి. ఈ నెల 9న రెండు పార్టీలకు చెందిన సమన్వయ కమిటీ నేతలు భేటీ కానున్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఎందుకు ప్రజలు తిరస్కరించాలో అందరికీ అర్థమయ్యేలా కరపత్రాలు, సోషల్ మీడియా ద్వారా బలంగా తీసుకెళ్లాలనే అంశంపై చర్చించి ఒక నిర్ణయం తీసుకునే వీలుందని ఆయా పార్టీల నుంచి అందుతున్న సమాచారం. క్షేత్రస్థాయిలో ఇసుక, మద్యం, మైనింగ్‌లో వైసిపి నేతలు దోచుకుంటున్నారని, ఇది ప్రజలకు అర్థమయ్యేలా నియోజకవర్గాల్లో నేతలు ఇంటింటి ప్రచారం చేసేందుకు షెడ్యూల్ ఖరారు చేయనున్నారు. రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తున్నప్పటికీ.. ప్రజలు వలసలు వెళ్లకుండా ప్రత్యామ్నాయం చూపడంలో ప్రభుత్వం విఫలమైందనే వాదనను కూడా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని రెండు పార్టీలు నిర్ణయించినట్లు సమాచారం. అలాగే ఉమ్మడి మేనిఫెస్టోలో చేర్చే అంశాలపై రెండు పార్టీల నేతలు చర్చించే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయి.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం విఐపి విరామ దర్శనంలో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శ్రీకాంత్, సినీ నటుడు రాజేంద్రప్రసాద్, డిప్యూటీ సిఎం నారాయణస్వామి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఇఒ ధర్మారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల డిప్యూటీ సిఎం నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో అమ్ముడుపోయే విధానానికి స్వస్తి పలకాలన్నారు. ప్రత్యక్ష ఎన్నికలతోనే దేశంలో అవినీతి మాయమవుతుందని అభిప్రాయపడ్డారు.

'ఎయిడెడ్' కారుణ్య నియామకాలు

- ఎపి టీచర్స్ గిల్డ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎయిడెడ్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల జిఒ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి చిట్టిబాబు, ఎల్‌కె చిన్నప్ప ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని శాఖల ఉద్యోగులకు కారుణ్య నియామకాల కింద ప్రభుత్వం ఉద్యోగాలు మంజూరు చేస్తుందని అన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు మెడికల్ రీయింబర్స్‌మెంటు, కారుణ్య నియామకాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయంలోనే రాష్ట్ర వ్యాప్తంగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు 169 మంది మరణించారని తెలిపారు. అన్ని శాఖల ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద కలెక్టర్ల సమక్షంలో ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. 2000 నుంచి ఇప్పటి వరకు 500 మంది ఎయిడెడ్ సిబ్బంది కుటుంబ సభ్యులు నియామకానికి అర్హులని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జిఒ విడుదల చేయాలని కోరారు.


కర్నూలులో డిసెంబర్ 15 నుంచి కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

- తిక్కారెడ్డి అధ్యక్షతన ఆహ్వాన సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలులో డిసెంబర్ 15, 16, 17 తేదీల్లో జరగనున్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమావేశాలను జయప్రదం చేసేందుకు ఆహ్వాన సంఘం ఏర్పాటైంది. కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఎంపిపి సమావేశ మందిరంలో అఖిల భారత కిసాన్‌సభ ఆహ్వాన సంఘ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా టిడిపి మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్యాలకుర్తి తిక్కారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, కోశాధికారిగా జి.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం.ఎ.గఫూర్, అర్జా రామకృష్ణ, మరో వంద మందితో కమిటీని ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమం తరువాత అంతటి చరిత్రను సృష్టించిన ఢిల్లీ రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన ఎఐకెఎస్ (అఖిలభారత కిసాన్‌సభ) జాతీయ సమావేశాలను కర్నూలులో నిర్వహించడం రైతు ఉద్యమానికే కాకుండా.. కరువు ప్రాంతంగా ఉన్న కర్నూలుకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిధులు రాక, నీళ్లను ఆపుకోలేక కర్నూలు జిల్లా ఎడారిగా మారిందన్నారు. కరువు కారణంగా ఊళ్లకు ఊళ్లు వలస బాట పట్టాయని తెలిపారు. దేశంలో కార్పొరేట్ సంస్థల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.60 లక్షల కోట్లను ఉదాసీనంగా మాఫీ చేసిందన్నారు. దేశం ఆకలిని తీర్చే రైతుల రుణాలను రద్దు చేయమంటే దేశ ఆర్థిక పరిస్థితి తలకిందులవుతుందని మోడీ ప్రభుత్వం అడ్డగోలు సమాధానాలు చెబుతోందని విమర్శించారు. జాతీయ సమావేశం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగ సమస్యలను చర్చించడంతోపాటు, జిల్లా రైతుల దుస్థితిని దేశవ్యాప్తంగా ఎండగట్టడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

తిక్కారెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా కరువు పరిస్థితులకు పాలకులే కారణమని అన్నారు. పులికనుమ, వేదవతి, గుండ్రేవుల వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే ఎంతో మేలు జరిగి ఉండేదని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు ముందుగానే ధర ప్రకటించి అమ్ముతున్నారని, ఆరుగాలం కష్టపడి పండించే రైతు ఉత్పతులకు మాత్రం సాగుకు ముందుగా ధరలు నిర్ణయించడం లేదన్నారు. దీంతో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి వనరులు లేక కర్నూలు పశ్చిమ ప్రాంతం ఎడారిగా మారుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.

దళితనేతపై చిత్రహింసలు హేయం

- టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పుంగనూరులో దళితనేతపై చిత్రహింసలు హేయమని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రంలో పోలీసులు వైసిపి ప్రైవేట్ సైన్యంలా మారి ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రత్యేకించి పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆటవిక పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఎటువంటి కేసులేని తమ పార్టీ దళిత నేత ముల్లంగి వెంకటరమణను కల్లూరు సిఐ కత్తి శ్రీనివాసులు అక్రమంగా నిర్బంధించడమేకాక చేతులు వెనక్కికట్టి, నోట్లో గుడ్డలు కుక్కి చిత్రహింసలకు గురిచేయడం తాలిబన్ రాజ్యాన్ని గుర్తుకు తెస్తోందన్నారు. కల్లూరు సిఐపై డిజిపి తక్షణమే విచారణ జరిపి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న రాజ్యహింసను నిలువరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమ కేసులు తగవు : నక్కా

ప్రజలు, ప్రతిపక్షాలపై వైఎస్ జగన్ అక్రమ కేసులు పెడుతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. దళితులు, ఇతర వర్గాలపై దారుణాలకు పాల్పడుతున్న వారిని శిక్షించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు పోలీసులు కాపలా కాస్తూ టిడిపి నేతల్ని ఇళ్లలోంచి అడుగు బయటపెట్టకుండా ఆంక్షల పేరుతో అడ్డుకుంటున్నారని తెలిపారు. రాజధాని అమరావతిలో నిర్మాణ సామగ్రి, యంత్ర సామగ్రి, విలువైన పరికరాలను అధికార పార్టీ దొంగలిస్తుందని టిడిపి మహిళా నేత పాలడుగు వినీతి ఆరోపించారు. తిరుమల దర్శనాలను సొమ్ము చేసుకునే దుస్థితికి వైసిపి నేతలు, మంత్రులు దిగజారారని టిడిపి బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు బుచ్చి రామ్‌ప్రసాద్ విమర్శించారు.

7న రైతు భరోసా రెండో విడత సాయం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి -నెల్లూరు అర్బన్

రెండో విడత రైతు భరోసా సాయాన్ని ఈ నెల 7న విడుదల చేయనున్నట్లు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. పుట్టపర్తిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతు ఖాతాలలో జమ చేస్తారని చెప్పారు. నెల్లూరులోని వైసిపి కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్రంలో 103 మండలాలను కరువు మండలాలుగా గుర్తించామని తెలిపారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. సాధారణంగా 574.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 487.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. అందువల్ల రైతులకు 40 శాతం సబ్సిడీతో 89 వేల మందికి రూ.40.45 కోట్ల విలువ చేసే శనగ విత్తనాలను రైతులకు ఇచ్చినట్లు తెలిపారు. నిర్దేశించిన పంటలు వేసి ఆశించిన దిగుబడి రాక, నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ సొమ్మును డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని చెప్పారు. కరువు మండలాల ప్రకటనలో ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేంద్రం నిబంధనల ప్రకారమే ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఇచ్చిన డేటా ప్రకారమే అక్టోబర్ 31వ తేదీ నాటికి ప్రకటించామని తెలిపారు.

ఉత్సాహంగా వైజాగ్ నేవీ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో విశాఖ బీచ్ రోడ్డులో ఆదివారం తలపెట్టిన 'వైజాగ్ నేవీ మారథాన్' ఎనిమిదో ఎడిషన్ ఉత్సాహంగా సాగింది. నాలుగు విభాగాల్లో జరిగిన ఈ మారథాన్‌లో 20 వేల మంది రన్నర్లు పాల్గొన్నారు. 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌ను ఉదయం 4:15 గంటలకు తూర్పు నావికాదళాధిపతి, వైస్ అడ్మిరల్ రాజేష్ పంధార్కర్ బీచ్ రోడ్డులోని ఎంజిఎం గ్రౌండ్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌ను 5.15 గంటలకు వైస్ అడ్మిరల్ జి శ్రీనివాసన్, పది కిలోమీటర్ల 10 కె రన్‌ను 6 :15 గంటలకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ రవిశంకర్, 5కె రన్‌ను 6 :45 గంటలకు వైస్ అడ్మిరల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ హెచ్‌క్యు సమీర్ సక్సేనా ప్రారంభించారు. 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్ ఐఎన్ఎస్ కళింగా వరకు, 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ గీతం యూనివర్సిటీ వరకు, 10కె రన్ తెన్నేటి పార్క్ వరకు, 5కె రన్ కాళీ మాతా గుడి వరకు వెళ్లి మరలా ఎంజిఎం గ్రౌండ్‌కు చేరుకున్నాయి. ఈ వైజాగ్ నేవీ మారథాన్‌లో 40 శాతం మంది ఇండియన్ నేవీ సిబ్బంది, కుటుంబీకులు, 60 శాతం మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తూర్పు నావికాదళాధిపతి రాజేష్ పంధార్కర్ మాట్లాడుతూ రోజువారీ పనుల్లో మానసిక ఒత్తిడికి గురవుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మారథాన్ విజేతలకు జిల్లా కలెక్టర్ ఎ మల్లికార్జున బహుమతులు అందజేశారు.



మారథాన్‌లో పాల్గొన్న నేవీ సిబ్బంది, ప్రజలు



హోమియో వైద్యం బలోపేతం

- మండల కేంద్రాల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేయాలి
- ఐఐహెచ్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హోమియో వైద్యాన్ని ప్రభుత్వం బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని, గ్రామస్థాయి నుంచి మండల, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో వెంటనే హోమియోపతి చికిత్సాలయాలు ప్రారంభించాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్ భాస్కరరావు విజ్ఞప్తి చేశారు. విజయవాడ గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ఐఐహెచ్‌పి రాష్ట్ర మహాసభ డాక్టర్ పంకజాక్షన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో భాస్కరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం హోమియోపతి కళాశాలలను మెరుగుపరచాలని, టీచింగ్ స్టాఫ్ పెంచాలని అన్నారు. పిజి కోర్సుల్లో కొత్త బ్రాంచులు జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, సైక్రియాట్రి విద్యా విభాగాలను ప్రభుత్వం ప్రారంభించాలని కోరారు. ఐఐహెచ్‌పి జాతీయ మాజీ అధ్యక్షులు ఆర్‌కె ప్రభాకర్‌మూర్తి మాట్లాడుతూ.. జిల్లాకొక 20 పడకల హోమియో ఆస్పత్రిని ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్దానం, ఎ కొండూరు గ్రామాల్లో కిడ్నీ వ్యాధి గ్రస్తులకు హోమియోపతి వైద్య విధానం ద్వారా పరిశోధన వెంటనే ప్రారంభించాలని కోరారు. వ్యవసాయం, పశు సంవర్ధకశాఖ విభాగాల్లో హోమియోపతి మందులతో పరిశోధనలు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మహాసభకు పలు రాష్ట్రాల నుంచి డాక్టర్లు హాజరయ్యారని తెలిపారు. పిసిఒడి సమస్య, హోమియో చికిత్స గురించి బెంగళూరుకు చెందిన డాక్టర్ బిడి పటేల్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎస్‌కెఎమ్ శాస్త్రి ప్రసంగించారు. మీడియా సమావేశంలో డాక్టర్లు ఐ దీపక్, కెవి నాగేశ్వరరావు, కృష్ణ చైతన్య, హనుమంతరావు, కెఎస్ సాయిరామ్, నరేంద్రనాథ్, బిఎస్ మోహన్ పాల్గొన్నారు.

విఆర్‌ఒల మానసిక క్షోభ : భూపతిరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ రెవెన్యూ అధికారులు (విఆర్‌ఒ) పని భారంతో మానసిక క్షోభ అనుభవిస్తున్నారని, అధికార యంత్రాంగం ఇప్పటికైనా ప్రాధాన్యతా పరంగా పనులు అప్పగించాలని ఎపి విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు పేర్కొన్నారు. విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రేడ్-2 విఆర్‌ఒలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలను తక్షణమే విడుదల చేయాలని, రీ సర్వేకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శ్యాంబాబుకు న్యాయం జరిగే వరకూ పోరాటం : కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ జిల్లాలో దాడికి గురైన దళిత యువకుడు శ్యాంబాబుకు న్యాయం జరిగే వరకూ ప్రజా సంఘాలు అండగా ఉంటాయని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి తెలిపారు. ఆంధ్రా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్యాంబాబును ఆదివారం ఉదయం ప్రొఫెషనల్ ఫోరం నాయకులు నేతి మహేశ్వరరావుతో కలిసి మాల్యాద్రి పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాల్యాద్రి మాట్లాడుతూ.. న్యాయం జరిగే వరకూ శ్యాంబాబు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ముద్దాయిలను అరెస్టు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అన్ని కేసుల్లోనూ పోలీసులు ఇదే తరహా పురోగతి సాధించాలని కోరారు. శ్యాంబాబును తీవ్రంగా కొట్టారని, కేసులో పెట్టిన సెక్షన్లు చూస్తే ప్రభుత్వం నీరుగార్చాలనే ఉద్దేశం ఉన్నట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు నిందితులను వెనకేసుకురావడం వల్లే దళితులపై పదేపదే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. దళిత యువకుడిని చంపి డోర్ డెలివరీ చేసిన అనంతబాబును ప్రభుత్వ కార్యక్రమాలకు రాచమర్యాదలతో పిలుస్తుంటే న్యాయం ఎక్కడుందని ప్రశ్నించారు. ప్రొఫెషనల్ ఫోరం నాయకులు నేతి మహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో కులాల మధ్య ఘర్షణలు పెరుగుతున్నాయని అన్నారు. ఓట్ల కోసం ముఖ్యమంత్రి సైతం కులాల ప్రస్తావన తీసుకొస్తున్నారని విమర్శించారు. పేదలకు పెత్తందార్లకు మధ్య యుద్ధం అంటున్న జగన్‌మోహన్‌రెడ్డి.. దళితులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. పాలకుల తీరుతో యువత కులాల మత్తులోకి జారుకుంటోందనడానికి ఎన్‌టిఆర్ జిల్లా ఘటనే కారణమన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

సమాజ శ్రేయస్సు పోరులో యుటిఎఫ్ ముందంజ

- యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభలో ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధ్యాయుల హక్కులు, సమాజ శ్రేయస్సు కోసం ముందుండి యుటిఎఫ్ పోరాటాలు చేస్తోందని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఆదివారం జరిగాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా శంకరరావు పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాడుతూనే సమాజం మార్పు చెందాలని, అందుకు కొంత సమయాన్ని పేద విద్యార్థుల బోధనలకు కేటాయిస్తామని ప్రకటించినందుకు యుటిఎఫ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గిరిజన విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలోనూ, ఉపాధ్యాయుల సమస్యలపైనా తన పరిధిలో సాధ్యపడినంత సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠ్యాంశాల్లో ఉన్న సారాంశంతోపాటు సమాజాన్ని చదివే భావజాలాన్ని విద్యార్థులకు అందించాలని, ఆ బాధ్యత యుటిఎఫ్‌పైనే ఉందని తెలిపారు. పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర మాట్లాడుతూ టిడిపి హయాంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో ప్రాధాన్యనిచ్చిందని, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం పూర్తిగా విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని విమర్శించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పాజీ వెంకటస్వామి, రామిరెడ్డి, శేషగిరి, గీత వంటి అమరులైన వారి ఆదర్శ భావాలు, పోరాట త్యాగాలు మనకు ఆదర్శం కావాలన్నారు. మన్యం ప్రాంతంలో గిరిజన విద్యాభివృద్ధికి రానున్న రోజుల్లో ఐక్య పోరాటాలు చేయాలని కోరారు. జెఎసి జిల్లా చైర్మన్ కిషోర్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ నిత్యం పోరాటాలు చేస్తుందని, జెఎసి తరపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాని తెలిపారు. ఈ ఉత్సవాల్లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉత్సవాలకు ముందు డిఇఒ కార్యాలయం నుంచి సభా ప్రాంగణం వరకూ ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలపై ఎపిడబ్ల్యుజెఎఫ్ హర్షం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆవిర్భావ దినోత్సవం విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకట్రావు కేక్ కట్ చేసి వేడుకను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా ఫెడరేషన్ జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతూనే ఉందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు మూడు సెంట్ల స్థలం ఇవ్వడానికి కేబినెట్ ఆమోదం తెలపడం జర్నలిస్టులందరికీ తియ్యని కబురేనన్నారు. ఇళ్లస్థలాల పంపిణీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి సంక్రాంతికల్లా జర్నలిస్టులకు అందజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం కోసం పనిచేస్తున్న జర్నలిస్టు మిత్రులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఫెడరేషన్ నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కలిమిశ్రీ, ఎంబి నాథన్ మాట్లాడుతూ ఎంతో కాలంగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నామని, జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయబోతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇళ్ల స్థలాల కోసం నిరంతరం ఫెడరేషన్ తరపున అవిశ్రాంత కృషి చేసిన రాష్ట్ర నాయకులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిబిజెఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాసరావు, ఫెడరేషన్ విజయవాడ పశ్చిమ కార్యదర్శి ఫణి, జెవి శ్రీనివాసరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.



" ఈ సృష్టిలో పశుబలమనీ, ఆత్మబలమనీ రెండు శక్తులు లేవు. ఉన్నది ఒకటే శక్తి. ధనికులు బీదలను మోసగించడానికి పండితులకు దబ్బిడి ఆత్మశక్తిని సృష్టించినారు."
- మాలపల్లి నవలలో ఉన్నవ



పక్షుల నీటి జాడ


రేపు రాసే కవిత్వం కోసం
ఈవాళ నిద్రపోను
రాసిన కవిత్వం ఎవరిదైనా
ఏ క్షణమూ తప్పి పోనీయను
అది నన్ను బతికించే తోవ
పక్షులు ఏ నీటి జాడని వెతుకుతాయో
అది పసికట్టే వేటకాడ్ని
చేపలు పట్టే కాలాన్నీ, గాలాన్నీ
పలక మీద దిద్దుకొనే పిల్లవాడిని!

క్షమించండి నన్ను
మీ కవిత్వం కోసం నావి
ఎన్ని వెతుకులాటలో
అందులో కవిత్వం లేకపోతే
థర్మామీటరులాగ రీడింగ్
చూపించే వెర్రివాడిని
చాలామంది కవులకి
నేనంటే అందుకే కోపం ..!

వాడుకొనే వాళ్ళకి
మన్నికైన తివాచీని!
నాకుగా నేను కవిత్వం రాయను
అది వచ్చి వాలవల్సిందే!
ఏ ఋతువులో అయినా
ఏ క్షణంలో అయినా
పక్షిలా ఏదో పాడుకొనే
సంచారిని నేను ...
నా గూటిలో ఎన్ని
సంక్షోభాల్ని పొదిగానో!

చాలు ఈ రాత్రిని తాగి
నా చషకం మీ కోసం దాచిపెట్టి పోతాను!

- సాగర్ శ్రీరామకవచం
98854 73934



హరితపత్రం

సగం దేహం ఒడలిపోయి
సగం సహచరిని తలుస్తూ
అండా సెల్ గోడల మధ్య
చలికి గడ్డకడుతూ, వొంకర్లు పోతూన్న దేహం
దు:ఖప్రణయాన్ని ఆలపిస్తోంది..

చెట్టు వేళ్లనుండి
రక్తప్రసరణ గుండెకు చేరడం లేదు
మట్టికి చెట్టుకి మధ్య తెగిపడుతున్న
ప్రాణసంబంధం నిలుపుకుంటూ..
బంధాలను ముళ్ళు వేసుకుంటున్న
ఆరాట పోరాటం.. క్షణ క్షణం

ఇది దేశం కోసం
ఇది సగటు మనిషికోసం
స్వీయపతన కఠోర శిక్ష
భరింప శక్యం కాని బాధల చలి
వెచ్చటి రగ్గు సెగ కోసం ఎదురు తెన్నులాట

అవునూ..
శరీరం చచ్చుబడితే ఏం..
హరితపత్రానికి మెదడుంది
ఆ మెదడు నిరంతరం ఆలోచిస్తుంది
ఆలోచించడమే నేరమని
పది టన్నుల బాంబు కంటే ప్రమాదకరమని కదా
శ్రీమాన్ న్యాయస్థానం తీర్పు !

ఓపికలేదు.. ఓదార్పు లేదు...
కొండంత స్థైర్యం ముందు
మీ అధికార దర్పం
ముక్కలు ముక్కలవుతున్న దర్పణం

మంచినీళ్ల నిరాకరణ
బ్లాంకెట్ ఇవ్వడానికి నిరాదరణ
అతనిప్పుడు మీకో చలిభూతం
మిమ్మల్ని సరసరా కోసేస్తున్నట్టు
గాలికేగిరిపోయే
పొట్టుపొట్టయిపోతున్న భయంతో
దివ్యాంగమవుతున్న రాజ్య గోముఖాల
రాక్షస కొమ్ము..

మానవత్వపు హక్కుల పూల చెట్టయి..
నిషేధిత పిట్ట రెక్కలకు
ఆకాశ వీధులయ్యి
కనీసపు బతుకుని వెచ్చించుకోడానికి
గొంతులో గొంతుకయి
మాటతో పాటతో
బతుకు భయాన్ని వెళ్లగొట్టి
తిరిగి మొలకెత్తుతున్నందుకా
ఈ మీ నిర్బంధం..!

అయితే మీ కళ్ళల్లోకి చూడండి
ఆ సంకల్ప బలం
ఎత్తైన దారువృక్షాలతో నిండి
మీ దేహాల్ని ఆక్రమిస్తుంది
నిత్య చైతన్య హరితపత్రం
అందాక వేచి చూడండి ...!

(ప్రొఫెసర్ సాయిబాబా కోసం)
- నేలపూరి రత్నాజీ
89199 98753

అగ్రహారంలో అగ్రభాగాన నిలిచిన 'దార్ల'

సమీక్ష

ప్రేతాత్మ కథలు సినిమాలుగా తీసి సొమ్ములు చేసుకుంటున్న ఈ కాలంలో, నిజాయితీతో కూడిన ఆత్మకథలు రాసే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతూ ఉంది. ఆత్మ కథలు ఒక కాలపు చరిత్రని, సమాజాన్ని, ఆ కాలపు ఆలోచనలను ప్రతిబింబిస్తాయి. ఒక యువకుడికి ఒక అనుభవజ్ఞుడు జీవితాన్ని ఎంత స్పష్టంగా చూపించగలడో, అంత పనిని ఆత్మకథలు చేయగలవనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆత్మకథలు దారి దీపాలుగా నిలుస్తుంటాయి. ఆత్మ కథలు మార్గదర్శనం చేయగలవు. ఆత్మ కథలు ఒక స్ఫూర్తిని అందించగలవు. ఆత్మకథలు కొన్ని సందర్భాల్లో ఎలా ఉండాలో నిర్దేశిస్తాయి. మరికొన్ని సందర్భాల్లో ఎలా ఉండకూడదో తట్టి చూపుతాయి.

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ఆయన ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ ముందుకు సాగుతున్నారు. దార్ల, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదులో చదువుకొని అదే విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి అక్కడే తెలుగు ఆచార్యులుగా, ఆ తర్వాత తెలుగు శాఖకు అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఆయన అనేక జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో ప్రామాణికమైన పత్ర సమర్పణలు చేస్తూ ఉంటారు. కీలకోకన్యాసాలు చేస్తూ ఉంటారు. మంచి కవిత్వం రాస్తుంటారు. నిరంతరం సాహిత్యాన్ని వెలిగించే ప్రయత్నం ఆయన ఎప్పుడూ విడవలేదు. ఆయన ఇటీవల వెలువరించిన ఆత్మకథ నెమలి కన్నులు.

తన ఆత్మ కథను ప్రారంభిస్తూ రాసిన ప్రారంభ వాక్యాలు ఆయనలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తున్నాయి.


"మా ముత్తాత చెప్పులు కుట్టేవాడు. మా తాత కూలికె ళ్ళేవాడు. మా అయ్యెమో అక్షరం కోసం ఆశగా ఎదురు చూసేవాడు. నేనిప్పుడు కవిత్వం రాస్తున్నాను. రేపు నా కొడుకు ప్రొఫెసర్ అవుతాడు." ఈ వాక్యాల్లోనే ఆయన తన ఆత్మకథ ఆత్మను మొత్తం ఆవిష్కరించాడు. తన ముందు తరాల నుంచి రాబోయే తరాల వరకు ఏం జరగబోతుందో ఒక దార్శనికత తో వ్యక్తం చేశాడు.

ఈ ఆత్మకథలో బాల్యం నుండి ఆయనలో ఉండే ఆత్మాభిమానం ఆశ్చర్యపరుస్తుంది. ఈ ఆత్మకథ ద్వారా ఆయన తన అమ్మానాన్నల ప్రేమను, బాధ్యతను గుర్తు చేసుకున్నారు. తన చిన్ననాటి జీవితాన్ని మన కళ్ళ ముందు ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఒకప్పటి సామాజిక అసమానతలను, వాస్తవిక జీవితాన్ని ఆవిష్కరించారు. తన ఇబ్బంది పడిన సందర్భాల్లో , తనను ఇబ్బంది పెట్టిన మనుషుల కోసం తను ఎలాంటి వాడు చెప్పుకోవడం కోసం రాసిన వాక్యాలు చూడండి

"నన్ను నీటిలోకి తోసేసామనుకున్నారు. నాకు ముత్యాలు దొరుకుతాయని వాళ్లకు తెలియదు. నన్ను పాతాళంలోకి తొక్కేద్దామనుకున్నారు. నేనొక మహా వృక్షమై మొలుచుకోస్తానని వాళ్లకు తెలియదు. నన్ను ఆకాశంలోకి విసిరేద్దామనుకున్నారు. ఆ శూన్యం నుండే నేను అందరి దాహాన్ని తీర్చే ఓ నీటిచుక్కనై కురుస్తానని వాళ్లకు తెలియదు"

ఈ ఆత్మ కథలో రచయిత తన సాయం చేసిన వారిని, తనకు గాయం చేసిన వారిని రికార్డు చేశాడు. సాయం చేసిన వాళ్ళకి కృతజ్ఞతలు చెప్పాడు. గాయం చేసిన వాళ్ళకి క్షమాభిక్ష ప్రసాదించాడు.

ఆత్మ కథలో మొదటి భాగాన్ని ప్రారంభిస్తూనే ఆయన పెట్టిన శీర్షిక "మా ఊరి పేరు అగ్రహారం". ఈ శీర్షిక ద్వారానే ఆయన పరోక్షంగా ఏం చెప్పదలుచుకున్నారో మనకు తెలిసిపోతుంది. అయితే, ఆయన చెప్పాలనుకున్నది జరగని విషయాలు ఏమీ కావు. చిన్నప్పుడు నుంచి ఆయన ఎదుర్కొన్న అవమానాల కొన్ని, అనుమానాలు కొన్ని. వాటిని వ్యక్తం చేయడానికి ఆయన ఎక్కడా సందేహించలేదు. ఆయన పుట్టిన చెయ్యేరు అగ్రహారం, ఆ



చెరువుగట్టు ఇప్పుడు అంబేద్కర్ ఆశయం ప్రతిఫలించిన పూల తోట అని ఒకచోట ప్రకటించారు. అగ్రహారంలో పుట్టిన వెంకటేశ్వరరావు, ఆధిపత్య కులాల అధికారాలు చలామణి అవుతున్న రోజుల్లో అగ్రహారం నుండి మొట్టమొదటి పీహెచ్డీ చేసింది, యూనివర్సిటీలో ఉద్యోగం పొందిందీ, రేడియోలో టీవీలో మాట్లాడిందీ నేనే అని అచంచల ఆత్మవిశ్వాసంతో ప్రకటించుకున్నారు. అయితే ఈ మాటలన్నీ ఆయన అహంకారంతో చెప్పుకున్నవి కావు. ఆత్మాభిమానంతో చెప్పుకున్నవి. 'కోనసీమ ప్రేమ కౌగిలిలో మా ఊరు' అనే శీర్షిక ద్వారా తన చిన్నప్పటి ఊరు, ఆ ఊర్లోని పరిస్థితులు చెప్తూనే- తన ఊరు అంటే తనకు ఎంత ఇష్టమో రాసుకున్నారు. తన కులం వాళ్ల ఊరి చివర ఎందుకు ఇల్లు కట్టుకున్నారో ఆయనకు అర్థం అయ్యేది కాదు. ఊరి చివరకి ఎందుకు విసిరివేయబడ్డారో ఆయనకు ఎవరూ చెప్పేవాళ్ళు కాదు.

తన ఊర్లో చివరి భాగాన ఉన్న రంగరాజు కోడు కాల్వ గట్టుకి తనకు ఉన్న అనుబంధాన్ని గురించి చెప్తున్న చోట కాల్వ వంతెన పైనుండి కాలువలోకి దూకుతూ ఈత కొట్టిన వెంకటేశ్వరరావు కనిపిస్తారు. అక్కడ పశువుల్ని మేపుతూ నిలబడ్డ వెంకటేశ్వరరావు కనిపిస్తారు. కాల్వ గట్టుమీద శవాన్ని కాల్చినప్పుడు ఆ శవాల్ని వైద్యుడులా పరిశీలించిన ఆయన అల్లరి పనులు కనిపిస్తాయి.

దార్ల గారికి వాళ్ల నాన్న హీరో. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈ ప్రజ్ఞ పుస్తకాలు చదివిన ప్రజ్ఞ కాదు. జీవితాలను చదివిన ప్రజ్ఞ. బతకడానికి అనేక పనులు చేస్తూ పొందిన ప్రజ్ఞ. తన నాన్న చేసే అనేక పనులను చూసి వెంకటేశ్వరరావు ఆశ్చర్యపోయేవాడు. పొలంలో పనులు, కొబ్బరికాయ దించడం, తాటాకుల కొట్టడం, చేపలు పట్టడం, బుట్టలు అల్లడం, కల్లు గీయడం ఇన్ని పనులు ఆయన జీవనం కోసం కొనసాగించేవారు. తెగులు సోకి వడలిపోతున్న కొబ్బరి చెట్లను బతికించడం ఎలాగో, మా నాన్నకు తెలుసని సంబరపడిపోయే వెంకటేశ్వరరావు, తన నాన్నను హీరోగా చూడ్డంలో అతిశయోక్తి ఏమీ లేదు. అలాగే, తన తల్లి కుటుంబాన్ని నడిపిన తీరు, పొదుపు సూత్రాలు, పిల్లల అదుపు సూత్రాలు, తనకు పేరు పెట్టిన తీరు ... ఇవన్నీ దార్ల చెప్పుకున్నారు. అరుంధతి మన ఆడపడుచు, మహాభారతం రాసింది మీ తాతగారే అంటూ తల్లి చెప్పిన కథలు తనలో ఎలా స్ఫూర్తి నింపాయో తెలిపారు. పనికి వెళ్లి పొద్దంతా పొలంలో పనిచేసి అలసిపోయి వచ్చి అమ్మకోసం, వెంకటేశ్వరరావు వాకిలి తుడిచేవాడు. కుండలు కడిగేవాడు. ఎసరు పెట్టేవాడు. అన్నం వండేవాడు. తన చెల్లెలు ఆలనా పాలనా చూసుకునేవాడు. 'నా బాల్యం ఏమీ పూల పరిమళం కాదు, నా బాల్యం నిప్పుల కుంపటి. తీపి జ్ఞాపకాలతో పాటు బాధలు గాథలు ఉన్నాయి' అంటూ జెండా పండుగ రోజు తనను "నువ్వక్కడినుండి వెనక్కి వెళ్ళు" అనే మాటలు ఎంత తీవ్రంగా గాయం చేశాయో, ఆ చిన్నతనంలో తను ఎంత సంఘర్షణ గురయ్యాడో చెబుతున్నప్పుడు మనకు కళ్ళల్లో నీళ్లు తిరుగుతాయి. తను పాలేరుతనానికి వెళ్ళినప్పుడు, ఆ యజమానులు పాచిపోయిన అన్నం పెట్టిన సంఘటన, ఆ అన్నం కంటే వాళ్లు కులం పేరుతో దూషించడం, తక్కువగా చూడ్డం ఇలాంటివి ఆయనను ఎంతో బాధించాయి. ఆ బాధలను ఆయన ప్రశ్నలుగా ఎదుర్కొన్నాడు. వాటికి జవాబులు చూపే ప్రయత్నం చేశాడు. నెమలి కన్నులు ఆత్మకథ జీవితానుభవాల సంఘర్షణగా ఆత్మస్సాక్షి ప్రమాణంగా సాగిన ఆత్మ కథ.

దార్ల పొలాన్ని చూసినట్లయితే బడిని చూసేవాడు. బడిలో పిల్లలను చూసేవాడు. స్వచ్ఛమైన నవ్వులను చూసేవాడు. వాళ్ళతో ఆయన కూడా ఉండాలనుకున్నాడు. ఆ స్ఫూర్తి తనకు అక్షరాన్ని రుచి చూపించింది అమ్మానాన్న నిరంతరం పడే కష్టమే ఆయన అనేక పనుల్ని నేర్పింది. దినపత్రికలు చదవడం కోసం మూటలు మోయడం ఆయనలోని చదువరని తెలుపుతుంది. అంబేద్కర్ ప్రభావం తనమీద ఎలాగా ఉండేదో కూడా చెప్తున్నారు .

ఈ ఆత్మ కథలో ఆయన బాధపడిన సంఘటనలు, ఆయనను బాధ పెట్టిన సంఘటనలు, వాటితో పాటు తన బాల్య జ్ఞాపకాలని, గొప్ప సంఘర్షణను చెప్పడం కోసం ఆయన అనేక సాక్ష్యాలు ఇచ్చారు. జీళ్ళ తయారీ, కొబ్బరి లవుజు ఉండల ప్రహసనం, బెల్లం ముక్క కథ, వాయకుడుం వండటం, తన అమ్మ నాన్నలు వండే అరిసెలు, పోకుండలు ఇలాంటి తినుబండారాల విషయాలు ఆయన సరదాగా రాసుకున్నప్పటికీ అందులో కూడా ఒక ఆంతర్యం ఉంది.

ఇప్పుడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ అధిపతిగా ఉన్న వెంకటేశ్వరరావు, ఆనాడు పదో తరగతిలో లెక్కల్లో రెండు మార్కుల్లో తప్పిపోవడం అనే విషయం దగ్గర ఈ ఆత్మకథను ఆపేశారు. పరీక్షల్లో తప్పిపోవడంతో జీవితం ఆగిపోదనే విషయాన్ని ఇక్కడ స్పష్టంగా తెలుసుకోవచ్చు.

నెమలి కన్నుల పేరుతో మొదటి భాగంగా ప్రారంభమైన ఈ ఆత్మ కథలో దళిత జీవుల హృదయాల్లో ఎన్నో తరాలుగా నిక్షిప్తమైన విషయాన్ని తెలియజేస్తుంది. దార్ల ఈ స్థాయిలో నిలబడడానికి గల కారణాలు మనకు తెలుస్తాయి. ఆయనను వెనకఉండి ప్రేమతో నడిపిన కుటుంబం మనల్ని పలకరిస్తుంది.

ఆయన ఒక చోట ఇలా అన్నారు : 'భారతదేశంలో హిందూ మత మూల భావాలున్న వేదాలు, ఉపనిషత్తులు, పురాణేతిహాసాల ప్రభావం లేని మతమేదైన్నా ఉంటే ఆ మతంపై హిందూ మత ప్రభావం పనిచేయని కులం లేని మతాన్ని చూడడం అసాధ్యం. వీటిని జయించి మనిషిగా నిలబడాలంటే హిందూ సమాజం నుండి వచ్చిన కొన్ని కులాల వారికి నిత్యం యుద్ధంచేయడం లాంటిదే. ఆ యుద్ధం, ప్రత్యక్షంగా కనిపించకుండా జరిగే యుద్ధం. రక్తం కారకుండా జరిగే యుద్ధం. ఆయుధాలు లేని యుద్ధం. మాటలతో చేతలతో మానసికంగా చంపేసేయుద్ధం. ఆధిపత్యాన్ని చలాయించే యుద్ధం.'

అందుకే దార్ల మనిషిగా బతకడం కోసం యుద్ధం చేశాడు. ఆత్మగౌరవంతో నిలబడటం కోసం యుద్ధం చేశాడు. జీవితం ఒక యుద్ధక్షేత్రం అని చెప్తూనే ఈ యుద్ధంలో విజేతగా ఎలా నిలిచాడో రెండవ భాగం ఆత్మకథలో చెప్పబోతున్నట్టు సూచన చేశాడు. నెమలి కన్నులు ఒక స్ఫూర్తివంతమైన ఆత్మ కథ. ఆ కాలపు చరిత్రను, సమాజాన్ని చిత్రీకరించిన ఆత్మకథ. అయితే ఈ ఆత్మకథలు రచయిత తనకు జ్ఞాపకం ఉన్నంత మేర తేదీలను గాని సంవత్సరాల గాని ప్రకటించి ఉంటే బాగుండేది. అయినప్పటికీ ఈ ఆత్మకథ ఒక వ్యక్తికి సంబంధించిన జీవితానుభవాల కాల పరిణామాన్ని, మంచి చెడులను, సంఘర్షణలను వాస్తవికంగా చెప్తూనే, తన కుటుంబ సభ్యులను, స్నేహితులను శత్రువులను, తనతో కలిసిన వారందరి వ్యక్తిత్వాలను అంచనా వేయడానికి దోహదం చేస్తుంది.

- డాక్టర్ సుంకర గోపాల్
94926 38547

అనేక భావాల కవితల పాత్రం

పుస్తకం

తెలుగు సాహితీవనం నాలుగో కవితా సంకలనంగా శాంతికృష్ణ సంపాదకత్వంలో వెలువడ్డ పుస్తకం 'ఎన్నో వర్ణాలు.' ఎన్నో భావాల హృదయ స్పందనలుగా ఇందులోని కవితలు ఉన్నాయి. పండుగలు, ప్రేమ, స్వాతంత్ర్య సమర యోధులు, గురువు, కల, మాతృభాష తదితర అంశాలపై జరిగిన పోటీల్లో గెలుపొందిన కవితల మాలిక ఇది.

ఉగాది అంశంపై మచ్చ రాజమౌళి 'కొత్త వెలుగుల పునాది', ఆర్. రెడ్డి ఈశ్వర్ ఆదిత్య 'శుభాల పల్లకి' పేరిట కవితలు రాశారు. బాధలు అన్నిటిని చిరునవ్వు సముద్రంలో కలిపేసి మన గొంతు ఎప్పుడు తీయదనాన్ని ప్రేమించినట్టు, గతాన్ని వదిలి మన సంతోష కలశంతో స్వాగతం పలుకుదాం అంటూ ఆదిత్య ఆశాభావం ప్రకటించారు. ఏ యుద్ధభీతికి తల్లడిల్లకుండా, ఏ రైతన్నా చెట్టు కొమ్మకు వేలాడకుండా హాయిగా నిద్రపోవాలి అంటూ, "నిజమైన యుగాది"ని ఆకాంక్షించారు అప్సర్ వలీసా.

"రెప్పకు ఆవల రంగులహేల" అంటూ సత్య చాగంటి ఆనందపు అంచుల్ని, అనుభూతుల సౌధాలను ప్రస్తావించారు. 'కల వరమా? కలవరమా?' అంటూ బంధకవి శ్రీనివాస రామారావు జీవితం గురించి అమూల్యమైన వాక్యాలను అందించారు. 'స్వప్న సుందరి' పేరిట వారణాసి భానుమూర్తి అందించిన కవితలో 'ఆమె ఒకసారి నవ్వితే శిశిరంలో రాలిన పువ్వులన్ని కొమ్మల వైపు వెళ్లి మళ్లీ చిగురుస్తాయి అని, ఆమె ఉన్నచోట వసంతమని చక్కటి పదచిత్రాలు దృశ్యమానం చేశారు. "మనగలనా" కవితలో లీలాకృష్ణ తాత్విక చింతన కనబరిచారు.

"నన్ను మరిచిపోకండి" అంటూ అచంట సుధా కళ్యాణి - మాతృభాష విన్నవించిన వేదనను తన కవితలో పలికించారు. "స్వాతంత్ర సమరయోధులు" అంశంపై లాక్కొండ కుళ్లాయప్ప, జె. వి.కుమార్ చేవూరి, అమర వీరులను శ్లాఘించారు. 'గురువు' అంశంపై రాస్తూ గొడుగు యాదగిరి రావు, ప్రకృతిని గురువుతో పోల్చారు. "జ్ఞాన బోధకుడు" కవితలో షేక్ రహీం సాహెబ్, విజ్ఞాన విషయ బోధనల మహర్షి, విద్యా దిక్సూచి, సవ్యసాచి, బాధ్యతల వారధి, అక్షర హాలికుడు అంటూ గురువు ఉన్నతమైన స్వభావాలను కళ్లకు కట్టారు. 'ఋషి' కవితలో మల్లాడి శ్రీనివాస్ తాను నాటిన విత్తు వటవృక్షమై పదిమందికి



నీడనిచ్చినప్పుడు, గురువు గర్వంతో మళ్ళీ శిల్పాలు చెక్కే పనిలో నిమగ్నమవుతాడని పేర్కొన్నారు. "గురుదేవోభవ" అంటూ ఎం.ఎస్ చారి రాశారు.

'మానవుడే నా మొక్క' అంటూ రాయపురెడ్డి సత్యనారాయణ నేడు విచ్చు కత్తుల మధ్య జీవిస్తున్న మానవుడిని మొక్కగా నాటాలంటూ రాశారు. 'అతను ఆమె' కవిత పాఠకుల హృదయాలను హత్తుకుంటుంది. 'సేద్యం' కవితలో ఇంద్రగంటి మధుసూదనరావు - రైతు ఆవేదన వినిపించారు. తన కవితలో గాయత్రీ దేవి 'పనిమనిషి' గురించి ప్రశంసాపూర్వకంగా రాశారు.

పండుగ అంశంలో భాగంగా, మహేష్ ఊటుకూరి, వనిత నోముల, మంథా అనురాధ, అరుణ దూళిపాల ... సంక్రాంతి శోభను, మనుషుల ఆనంద సందడిని కళ్లకు కట్టించారు.


'మాతృభాష' అనే అంశం పురస్కరించుకొని- అఖండ ప్రస్థానం నా తెలుగు భాష అంటూ కొత్త భానుప్రియ మంచి కవిత అందించారు. 'అమ్మ అనే పిలుపు' కవితలో పానుగంటి శ్రీనివాస్ రెడ్డి గద్య, పద్య, వ్యాకరణ, ఛందస్సులకున్న విశిష్టతను వివరించారు. 'మాట్లాడాలనుంది' అంటూ కొత్తపల్లి మణి త్రినాథ రాజు చక్కని కవిత అందించారు. 'అమ్మ భాష' అంటూ డాక్టర్ హనీఫ్చంద్ర తెలుగును కీర్తించారు. ఈ అంశంపై ఇంకా ముక్క శ్రీనివాస్, రమేష్ గాదె, డాక్టర్ కొమురవెల్లి అంజయ్య, డా. చదలవాడ ఉదయశ్రీ, పిళ్ళా కుమారస్వామి రాసిన కవితలు ఇందులో ఉన్నాయి.

ప్రేమాంశంగా వచ్చిన కవితల్లో డా. పాతూరి అన్నపూర్ణ - ఆ ప్రతిమను చూస్తూ ఎన్నో సూర్యోదయాలు చంద్రోదయాలు తరలిపోతాయని, హృదయంలో గుడి కట్టి ప్రతిష్ఠించిన శిల్పం తానంటూ భావాత్మకంగా వివరించారు. 'ఆమె ప్రేమ' అంటూ శాస్త్రి జి.ఎల్.ఎస్. ప్రేమ జీవన నావకు దారి చూపే దిక్సూచిగా పేర్కొన్నారు. 'ప్రేమామతం'లో వసుధాదేవి తిరుమల, 'నీ ప్రేమలో'లో సాగి అనిల్ కుమార్ వర్మ, 'ప్రేమ! వింటున్నావా!'లో శశికిరణ్ కొమాండూర్, 'ప్రేమతో'లో రామగోపాల్ కొమ్ముల, 'ప్రేమను గూర్చి నిజం' కవితలో ఎన్ బసవయ్య- ప్రేమభావనల సంస్పందనలను వివిధ కోణాల్లో వివరించారు.

తెలుగు సాహితీ వనం కార్యనిర్వాహక సభ్యులు రాసిన కవితలూ ఈ సంకలనంలో పొందుపరిచారు. 'అత్యున్నత శిఖరం' అంటూ శాంతికృష్ణ - అక్షరాలు నీ మదిలో కవితలుగా మారేవేళ/ నీ మాటలు కొన్ని హృదయాల వాకిళ్లలో అయినా తొలకరి చినుకులు కావాలీ' అని రాశారు. 'సర్వేంద్రియా నయనం ప్రధానం' అంటూ డాక్టర్ కృష్ణారావు రెడ్నం నేత్రాల ప్రాముఖ్యతపై కవిత అందించారు. 'యాచించను' అనే కవితతో తాటి మేటి సూర్యప్రకాశ రావు - ఆవేశాన్ని పెదవితోనే అదిమిపట్టి, ఎవరి ముందు చేయి చాచరాదని చక్కగా తెలిపారు. 'నీటి కుండ' కవితలో శ్రీధర్ రెడ్డి బిల్లా - 'తొణకని బెనకని నీటికుండ ఎన్నో అడ్డంకులు, అవమానాలు జరిగినా పగలని నీటికుండ' అంటూ హృద్యంగా రాశారు. 'అ'సంపూర్ణ కావ్యమంటూ నవీన్ చంద్ర హెూతా, జీవితం గురించి వ్యాఖ్యానించారు. 'కాలం గురించి సుమన ప్రణవ్ చక్కటి కవిత్వం అందించారు. సందడి అరుణ తన 'మహిళా' కవితలో మగువ గొప్పతనాన్ని వివరించారు. 'ఓ యువత మేలుకో' అంటూ కెవిఎస్ మూర్తి యువశక్తిని ప్రేరేపించారు. 'అమ్మ కొంగు' కవితలో శ్రీనివాస్ తొడుపునూరి - మాతృమూర్తి ప్రేమపాశాన్ని వర్ణించారు.

ఇలా అనేక భావాలను, ఉద్వేగాలను ఆవిష్కరించిన 'ఎన్నో వర్ణాలు' పేరుకు తగ్గట్టుగానే వైవిధ్యభరితంగా ఉంది. చదివి స్పందించాల్సిన కవిత్వం ఇది.

- అరుణ సందడి
99498 05100



దున్నేవాడిదే భూమని చాటిన 'ఏరువాక'

మన దేశంలో ప్రకృతి వనరులు విశేషంగా ఉండటం వల్ల అనాది నుంచి ఆహార ధాన్యాలు, ఫలసంపద, అటవీ ఉత్పత్తులకు కాణాచిగా ఉండేది. అందుచేతనే పాశ్చాత్యుల కన్ను మనపై పడింది. వ్యాపారం నిమిత్తం తొలుత పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి వారు; తరువాత బ్రిటీషువాళ్లు మనదేశంలో అడుగుపెట్టారు. ఇక్కడి వ్యవసాయక ఉత్పత్తుల్ని ముడి సరుకుల్ని వారి దేశాలకు అతి చౌకధరలకు కొనుక్కొని పోయి, అక్కడ వారి యంత్ర పరికరాలతో వస్తువుల్ని ఉత్పత్తి చేసి మళ్లీ వాటిని మన దేశానికే తెచ్చి విక్రయించి, అధిక లాభాలు గడించేవారు. రాను రాను మన ఖనిజ సంపద మీద కూడా కన్ను పడింది. దాన్ని కూడా ఆయా దేశాలకు తరలించుకుపోయేవారు. ప్రజలు పేదరికంలో మగ్గిపోయేవారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఈ పరిస్థితి మారలేదు. భూస్వామ్య వ్యవస్థ అలాగే ఉండి, దున్నేవాడికి భూమి కరువయ్యింది. పేదరైతులు ఏ బంజరు భూములో సాగు చేద్దామనుకున్నా భూస్వాములు, పెత్తందారులు తీవ్రంగా ప్రతిఘటించేవారు. అలాంటి తాడనలను, పీడనలను ఎదుర్కో వడానికి దేశంలో ఎక్కడికక్కడ రైతులు భూ పోరాటాలు చేశారు. ఆయా కాలాల్లో, ఆయా ప్రాంతాల్లో కవులు, రచయితలు, కళాకారులు తమ కళారూపాల ద్వారా ఆయా పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచారు. అలాంటి సందర్భంలో అభ్యుదయ కవి సీరపాణి రచించిన చైతన్య గీతమే 'ఏరువాక'.

పొద్దు పొడిచిందిలే ఓరన్నా!
మొద్దు నిద్దుర వీడు రైతన్నా!
మొక్కవోయిన పాత ఉక్కు నాగళ్ళన్ని.
పదును పెట్టే మంచి అదను వచ్చిందిరా!

భూస్వామ్యులను ఎదిరించడానికి తగిన సమయం వచ్చింది. బండదేరి మూలబడిపోయిన పాత ఉక్కు నాగళ్లను పదును పెట్టే సమయం ఆసన్నమైందని కవి రైతాంగాన్ని మేల్కొల్పుతున్నాడు.

కొండలన్నీ పేల పిండయ్యి పోవాలి!
కాదని బీడులు గుండయ్యి పోవాలి!
పుట్టలా, గుట్టలా బూజు దులిపెయ్యాలి!
మెట్టలూ, మెరకలూ మాగాణులవ్వాలి!

ఇక్కడ కొండలూ, బీడులూ, పుట్టలూ, గుట్టలూ కేవలం వస్తుపరమైనవే కావు. ఇవి కరడుగట్టిన భూస్వామ్య వ్యవస్థకు సంకేతాలు. వీటన్నింటినీ తెగగొట్టి, మెట్టల్ని మెరకల్ని కూడా మాగాణులుగా మార్చమంటున్నాడు కవి.

రెక్కలన్నీ విరిచి, రేయి పగలూ నిలిచి
కష్టించు పేదలకు కనరాదు నేల
భూమి మీదా కాలు మోపని బాబులకు
వందలూ, వేలు ఎకరాలెందుకోయి?

రైతాంగ పోరాటానికి మూల కారణమైన విషయం ఈ చరణాల్లో స్పష్టం చేశాడు కవి. భూమిపై కాలైనా మోపని సుఖజీవులకు వందలూ వేలు ఎకరాలెందుకని సూటిగా ప్రశ్నిస్తున్నాడు.

కోడి కూసే వేళ కాడేసు కెళుతుంటె
పుట్టలో నాగులు బుస్సుమని లేస్తాయి!
బెదిరి పోయావంటె బెంబేలు పెడతాయి!
ఎదిరి నిలిచావంటె చెదిరి పోతాయిరా!

బడుగు రైతులు తమ శక్తిని కూడగట్టుకొని భూస్వాములను ఎదురొడ్డి తమ పొలాలకు తామే హక్కుదారులుగా ప్రకటించుకుని సేద్యం చెయ్యడానికి ఉపక్రమిస్తారు. ఉషోదయ వేళ తమ ప్రయత్నాన్ని సఫలీకృతం చేసుకునే సందర్భంలో 'నాగులు' అంటే భూస్వాములు, పెత్తందారులు ప్రతిఘటిస్తారని భావం. ఆ ప్రతిఘటనలకు భయపడితే మరింత సంక్షోభానికి గురిచేస్తారంటున్నాడు. అదే ఎదురు నిలిస్తే తోకముడిచి పలాయనం చిత్తగిస్తారంటున్నాడు కవి.

తుమ్మ చెట్టులు నరికి, తుప్పలన్నీ పెరికి,
రంకె వేసే నదుల వంకరలు తీర్చేసి,
పాతాళ గంగను పైపైకి రప్పించి,
బంగారు పంటలే పండించవోయి!

భూమిని చదునుచేసి అనే అర్థంలో చెబుతున్నా, తుమ్మచెట్టును నరికి తుప్పలన్నీ పెరికి అంటే భూస్వామ్య వ్యవస్థను సమూలంగా తుడిచిపెట్టి అనే భావమే ప్రస్ఫుటమవుతోంది. రంకెవేసే నదుల వంకరలు తీర్చడమంటే, ప్రాజెక్టులు నిర్మించి వధాగా పోయే నదీజలాలను నిల్వచేసి అని కవి భావం. అలాగే వ్యవసాయ బోరుబావుల ద్వారా భూగర్భ జలాలను సైతం ఉపయోగించుకొని బంగారు పంటలు పండించమంటున్నాడు.

'రైతులంటే, పల్లె బైతు'లను సోమరుల
కూతలన్నీ పాడు నూతిలో పడతాయి!
'అన్నదాతకు మిన్న, అవనిలో లేదన్న'
చెక్కు చెదరని కీర్తి దక్కు నీకొక్కడికె!

ఎండనక వాననక కష్టపడి పంటలు పండించి ప్రపంచం ఆకలి తీర్చే రైతన్నలను పామరులుగాను, మోటు మనుషులు గాను గతంలో నాగరికలు చూసేవారు. అలాంటి వారిని సోమరు పోతులుగా కవి అభిశంసిస్తున్నాడు. 'అన్నదాతకు మించినవాడు ఈ ప్రపంచంలో ఎవడూ లేడు' అని తనకొక్కడికే శాశ్వతమైన కీర్తి దక్కుతుందని కవి ఉద్ఘాటిస్తున్నాడు.

భూ సంస్కరణల చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయకముందే, కవి రైతన్నలకు అండగా ఉండి రైతాంగ పోరాటాలకు స్ఫూర్తినివ్వడం సాహసోపేతమైన చర్య. కవులు, రచయితలు బీదలపాట్లను కరుణ రసాత్మకంగా వర్ణించి వారిపై సానుభూతి చూపించినంత మాత్రాన సమాజం ముందడుగు వెయ్యలేదు. కవి తాను కూడా వారితో మమేకమై ముందుండి నడిపించినట్లుగా భాసిస్తే అది ఏ ఉద్యమానికైనా వెయ్యేనుగుల బలం ఇస్తుంది.

ఈ గేయం 'సీరపాణి' రచించిన ఢమరుధ్వని కవితా సంపుటి లోనిది. సీరపాణి కవిత్వం ఎక్కువగా సంస్కృత పద భూయిష్ఠంగా ఉంటుంది. ఈ 'ఏరువాక' గేయం మాత్రం తేట తెలుగు పదాలతో పాడుకునేందుకు వీలుగా ఉంటుంది. ఇది జానపదశైలిలో నడిచిన గీతం. ఈ పాటను ఆ రోజుల్లో చాలామంది ప్రచారానికి ఉపయోగించుకున్నారు. దీని రచనాకాలం మే 31, 1972. ఈ కవిత 1975లో రాజమండ్రి పట్టణ యువజన సంఘం నిర్వహించిన కవితల పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకుంది.

సీరపాణి నామ చిహ్నం ప్రత్యేకత : సీరము అంటే నాగలి అని అర్థం. సీరమును ధరించిన వాడు సీరపాణి. రచయిత పూర్తి పేరు బుడితి బలరాం నాయుడు. సీరపాణి అనేది కలం పేరు.

- పిల్లా తిరుపతిరావు
70951 84846

35 మంది బిజెపి రెబల్స్‌పై వేటు

- బుజ్జగింపు ప్రయత్నాలు విఫలం తరువాతే బహిష్కరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
మధ్యప్రదేశ్‌లో 35 మంది బిజెపి నేతలపై వేటు పడింది. బుజ్జగింపు ప్రయత్నాలు విఫలం కావడంతో ఈ చర్య తీసుకుంది. పార్టీ అధికారిక అభ్యర్థులకు వ్యతిరేకంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న 35 మంది నేతలను బిజెపి సస్పెండ్ చేసింది. సస్పెండ్ చేసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది చంబల్, బుందేల్‌ఖండ్, మాల్వా-నిమార్ ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. వీరిలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు.మొరెనా నుంచి మాజీ మంత్రి రుస్తోమ్ సింగ్, తికమ్‌గఢ్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కెకె శ్రీవాస్తవ్, బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు నందకుమార్ చౌహాన్ కుమారుడు హర్షవ్ వర్ధన్ చౌహాన్, సిద్ధి నుంచి బిజెపి సిట్టింగ్ ఎమ్మెల్యే కేదార్‌నాథ్ శుక్లా తదితరులను పార్టీ సస్పెండ్ చేసింది. తిరుగుబాటు నేతలను శాంతింపజేసేందుకు కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్ సహా పలువురు సీనియర్ నేతలు రంగంలోకి దిగినా, విఫలమయ్యారు.
మధ్యప్రదేశ్‌లో మూడు రోజుల పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా తిరుగుబాటుదారులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. కొందరు ప్రముఖులు వెనక్కి తగ్గేందుకు నిరాకరించారు. 230 స్థానాలున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఈ నెల 17న ఎన్నికలు జరగనున్నాయి.



రాజస్థాన్‌లో బిజెపి ఐదో జాబితా

జైపూర్: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బిజెపి తన ఐదో జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఈ జాబితాలో 15 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. మావ్లీ (ఉదయ్‌పూర్) నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మనారాయణ్‌ను కాదని, ఆయన స్థానంలో కేజీ పలివాల్‌ను బరిలోకి దింపింది. సివిల్ లైన్స్ నుంచి గోపాల్ శర్మ, ఆదర్శ్‌నగర్ నుంచి రవి నాయ్యర్‌లకు టికెట్లు కేటాయించింది. వీరు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే మొదటిసారి. ఈ నెల 2న మూడో జాబితాలో మాజీ మంత్రి దేవీసింగ్ భాటి కోడలు పూనమ్ కన్వర్ భాటికి కొలాయత్ నియోజకవర్గ టికెట్ కేటాయించింది. ఆదివారం జాబితాలో ఆ పేరును తొలగించి.. ఆమె కుమారుడు అంశు మాన్ సింగ్ భాటికి అవకాశం ఇచ్చింది. రాజస్థాన్‌లో మొత్తం 200 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇప్పటివరకు బిజెపి 198 మంది పేర్లను ప్రకటించింది. సోమవారంతోనే నామినేషన్ల గడువు ముగియనుంది.

ఛత్తీస్‌గఢ్ తొలివిడత, మిజోరంలో ముగిసిన ప్రచారం

రేపే పోలింగ్

ఐజ్వాల్, రాయ్‌పూర్ : ఈ నెలలో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు రెండో దశకు చేరుకున్నాయి. ఛత్తీస్‌గఢ్ తొలి దశకు, మిజోరం ఆదివారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. మంగళవారం మిజోరంలోని మొత్తం 40 అసెంబ్లీ స్థానాలకు, ఛత్తీస్‌గఢ్‌లోని 20 స్థానాలకు మొదట విడతలో పోలింగ్ జరగనుంది. ఈ స్థానాల్లో ఆదివారంతో ప్రచారం ముగిసింది. మిజోరంలో 40 అసెంబ్లీ స్థానాల్లో 8.57లక్షల మంది ఓటర్లున్నారు. మొత్తం 174 మంది బరిలో నిలబడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 1,276 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్), జోరం పీపుల్స్ మూమెంట్, కాంగ్రెస్ మధ్య ప్రధానంగా పోటీ ఉంటుందని భావిస్తున్నారు. ఈ మూడు పార్టీలు అన్ని స్థానాల్లోనూ అభ్యర్థులను నిలిపాయి. బిజెపి 23 మందిని, ఆప్ నలుగురిని బరిలో నిలిపాయి. మరో 27 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ తరపున రాహుల్ గాంధీ తదితర నేతలు ప్రచారం నిర్వహించారు. అక్టోబర్ 30న మిజోరంలో జరగాల్సిన ప్రధానమంత్రి మోడీ పర్యటన ఆకస్మికంగా రద్దయ్యింది. తాజాగా మిజో ఓటర్లను ఉద్దేశించి మోడీ వీడియో సందేశం ఇచ్చారు. 'అద్భుత మిజోరం' కోసం బిజెపి కట్టుబడి ఉందని.. ఇందుకు రాష్ట్ర ప్రజల మద్దతు లభిస్తుందని ఆశిస్తున్నానని మోడీ పేర్కొన్నారు.


ఐజ్వాల్‌లో ఒక పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఇంటినుంచే 2 వేల మంది ఓటు
మిజోరంలో పోలింగ్ విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులకు పోస్టల్ బ్యాలెట్‌తోపాటు 80 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ఇంటినుంచే ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.
దీంతో 2,059 మంది వృద్ధులు, వికలాంగులు, 8,526 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. మిజోరంలో సాధారణంగా బారీ పోలింగ్ నమోదవుతుంటుంది. 2013 ఎన్నికల్లో 80 శాతానికి పైగా, 2018లో 81 శాతానికి పైగా ఓటింగ్ నమోదయింది.

ఛత్తీస్‌గఢ్‌లో
ఛత్తీస్‌గఢ్‌లో మొత్తంగా 90 స్థానాలు ఉండగా.. తొలివిడతలో 20 స్థానాల్లో పోలింగ్ జరగనుంది.మిగతా 70 స్థానాలకు ఈ నెల 17న రెండో విడతలో పోలింగ్ నిర్వహించను న్నారు.
ప్రస్తుతం జరుగుతోన్న 20 స్థానాల్లో ఎక్కువగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. తొలి దశ ఓటింగ్ జరిగే నియోజకవర్గాల్లో మొత్తంగా 6,444 మంది ఓటర్లు ఇంటి నుంచి ఓటు వేసే సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారని అధికారులు తెలిపారు.


శ్యోంపత్‌రామ్‌కు మద్దతుగా తరలివచ్చిన ప్రజలు

రాజస్థాన్‌లో సిపిఎం విస్తృత ప్రచారం

సికార్ : రాజస్థాన్‌లో సిపిఎం అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సభలకు, ఎన్నికల ర్యాలీలకు భారీగా జనం హాజరవు తున్నారు. రాయిసింగ్‌నగర్ నుంచి అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్యోంపత్‌రామ్ నామినేషన్ సందర్భంగా శనివారం వేలాది మంది జనం తరలివచ్చారు. అభ్యర్థికి మద్దతుగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సికార్ జిల్లా లక్ష్మణగర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన విజేందర్ దాకా నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

రైతు రుణమాఫీ, పంటల ధరలకు ప్రాధాన్యత

- కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో

భోపాల్: రైతుల రుణమాఫీ, పంటల ధరలకు ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆదివారం నాడిక్కడ ఆ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. రెండు రాష్ట్రాల్లో క్వింటాల్ బియ్యం రూ.3,200, గోధుమలకు రూ.3,000 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రమేష్ మాట్లాడుతూ, "కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రకటిస్తే సరిపోదు. ఎందుకంటే ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువ ధరకే రైతుల నుంచి పంటలు కొనుగోలు చేయడం జరుగుతున్నది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎంఎస్‌పి కచ్చితంగా అమలు చేస్తామని చెప్పింది. ఢిల్లీలో ఏడాది పాటు సాగిన రైతుల ఉద్యమంలో డిమాండ్‌లో ఒకటి కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని. నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదని ఆయన విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో రూ.2 లక్షల వరకు ఉన్న వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని ఈ మ్యానిఫెస్టో హామీ ఇచ్చింది. ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో గెలిచి కమల్‌నాథ్ నేతృత్వంలో కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించగానే ఆ ప్రభుత్వాన్ని ఫిరాయింపు రాజకీయాలతో బిజెపి కూల్చేసిందని జైరాం రమేష్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలకు హామీ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని (ఒపిఎస్‌ను)తిరిగి తీసుకువస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అలాగే ఛత్తీస్‌గఢ్‌లోని గిరిజన ప్రాంతాల్లో టెండు ఆకులను సేకరించేందుకు ఒక్కో బ్యాగ్‌కు రూ.6 వేలు ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో పేర్కొంది. ఛత్తీస్‌గఢ్ సిఎం భూపేష్ బఘేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై శ్రద్ధ చూపుతుందని అన్నారు. 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు.

క్రిమినల్ చట్టాలను మార్చే బిల్లుల ముసాయిదా నివేదికలు నేడు ఆమోదం..!

- హోంస్టాండింగ్ కమిటీ భేటీ
- కమిటీ మరింత విస్తృతంగా పరిశీలించడానికి ప్యానెల్ కోసం పొడిగించాలి : ప్రతిపక్ష సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
ప్రస్తుత మూడు క్రిమినల్ చట్టాలను మార్చుతూ తీసుకొచ్చిన మూడు బిల్లులను పరిశీలించిన హోం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ముసాయిదా నివేదికలను స్వీకరించడానికి సోమవారం సమావేశం కానుంది. కొంతమంది ప్రతిపక్ష సభ్యులు ఈ చర్యలను మరింత విస్తృతంగా పరిశీలించడానికి ప్యానెల్‌కు మరింత సమయం ఇవ్వాలని కోరారు. అక్టోబరు 27న హోంస్టాండింగ్ కమిటీ మూడు ముసాయిదా నివేదికలను అధ్యయనం చేయడానికి మరికొంత సమయం కావాలని ప్రతిపక్ష సభ్యులు ఒత్తిడి చేయడంతో వాటిని ఆమోదించలేకపోయింది. కొంతమంది ప్రతిపక్ష సభ్యులు ప్యానెల్ ఛైర్‌పర్సన్ బ్రిజ్‌లాల్ పదవీకాలాన్ని మూడు నెలలు పొడిగించాలని, స్వల్పకాలిక ఎన్నికల లాభం కోసం ఈ బిల్లులను బుల్డోజ్ చేయడం ఆపాలని కోరారు. అట్టడుగు వర్గాలకు సేవ చేసే పటిష్టమైన చట్టాన్ని రూపొందించడానికి, కమిటీ తదుపరి కొన్ని రోజుల్లో లేదా నవంబరులో తుది నివేదికను ఆమోదించకూడదని సభ్యులు కోరారు. అలా చేస్తే చట్టసభల పరిశీలన ప్రక్రియను అపహాస్యం చేసినట్లు అవుతుందని ప్రతిపక్ష వర్గాలు తెలిపాయి. కమిటీ విస్తృతమైన సంప్రదింపుల ప్రక్రియలో నిమగ్నమైందని, మూడు నెలల గడువును పూర్తి చేస్తుందని బిజెపి వర్గాలు తెలిపాయి. మూడు ముసాయిదాలను ఆమోదించడానికి సభ్యులకు పంపిన నోటీసు ప్రకారం, కమిటీ నవంబరు 6న సమావేశమవనుంది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొంతమంది సభ్యులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్యానెల్ ముసాయిదా నివేదికలను ఆమోదించవచ్చని వర్గాలు తెలిపాయి. వలస పాలన నాటి క్రిమినల్ చట్టాలను పూర్తిగా సవరించాలని కోరుతూ, హోంమంత్రి అమిత్‌షా వర్షాకాల సెషన్‌లో ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్-1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-1872 స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియంతో కూడిన మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆగస్టు 11న బిల్లులు ప్రవేశపెట్టిన తర్వాత వాటిని కమిటీ పరిశీలనకు పంపి మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని లోక్‌సభ కోరింది. కమిటీ మూడు బిల్లుల్లో సవరణల సిఫార్సు చేసే అవకాశం ఉందని, అయితే వాటి హిందీ పేర్లకు కట్టుబడి ఉంటుందని, డిఎంకెతో సహా ప్రతిపక్ష ఎంపిలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని ఆయా వర్గాలు తెలిపాయి. ప్రతిపాదిత చట్టాలకు ఆంగ్ల పేర్లను కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మహువా మొయిత్రాకు వ్యతిరేకంగా సిఫార్సులు

- రేపు ఆమోదించనున్న ఎథిక్స్ కమిటీ ముసాయిదా నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
టిఎంసి ఎంపి మహువా మొయిత్రాకు వ్యతిరేకంగా సిఫార్సుల మధ్య ఈ నెల 7న ఎథిక్స్ కమిటీ ముసాయిదా నివేదికను ఆమోదించనుంది. 15 మంది సభ్యుల కమిటీలో బిజెపి సభ్యులు మెజార్టీగా ఉన్నారు. ఈ నివేదికలో మహువా మొయిత్రా ప్రవర్తనను తీవ్రంగా పరిగణించే అవకాశం ఉంది. గత సమావేశంలో కమిటీ ఛైర్మన్ వినోద్ కుమార్ సోంకర్ తనను అసభ్యకరమైన, వ్యక్తిగత ప్రశ్నలు అడిగారని మహువా మొయిత్రా ఆరోపించగా, ఆయన ఆ ఆరోపణలను ఖండించారు. మహువా మొయిత్రాపై బిజెపి ఎంపి నిషికాంత్ దూబే చేసిన 'క్యాష్ ఫర్ క్వైరీ' ఆరోపణలకు సంబంధించి లోక్‌సభ ఎథిక్స్ కమిటీ తన ముసాయిదా నివేదికను పరిశీలించి, ఆమోదించడానికి ఈ నెల 7న సమావేశం కానుంది. ఈ నెల 2న జరిగిన సమావేశం నుంచి మొయిత్రాతోపాటు ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుంచి లంచం తీసుకుని, ఆయన ఆదేశాలకు అనుగుణంగా అదానీ గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుని మొయిత్రా లోక్‌సభలో ప్రశ్నలు అడిగారని దూబే ఆరోపించిన సంగతి తెలిసిందే.

నిజ్జర్ హత్య ఆరోపణలపై ఆధారాలు సమర్పించండి : భారత రాయబారి

ఒట్టావా : ఖలిస్తానీ వేర్పాటువాద నేత నిజ్జర్ హత్య ఆరోపణలపై కెనడా ప్రభుత్వం ఆధారాలు చూపాలని భారత రాయబారి సంజయ్ కుమార్ వర్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ మీడియా గ్లోబ్ అండ్ మెయిల్‌తో ఆయన మాట్లాడుతూ నిజ్జర్ హత్యలో భారతదేశ ప్రమేయం ఉందని ఆరోపించిన కెనడా, దాని మిత్ర దేశాలు స్పష్టమైన ఆధారాలు చూపించలేదని విమర్శించారు. ఈ కేసు దర్యాప్తులో వారికి సహాయం చేయడానికి నిర్దిష్ట లేదా సంబంధిత సమాచారం అందించలేదని చెప్పారు. ఈ దర్యాప్తు మొత్తాన్ని తారుమారు చేశారని ఆరోపించారు. ఈ హత్యలో భారత ఏజెంట్లు ఉన్నట్లు చెప్పాలని కెనడాలోని అత్యున్నత స్థాయి అధికారుల నుంచి సూచనలు వచ్చాయని అన్నారు.

బిజెపిలో చేరే వారే అవినీతిపరులు : కేజ్రీవాల్

చండీఘర్ : అవినీతికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వ పోరాటం ఓ 'జిమ్మిక్కు' అని ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విమర్శించారు. హర్యానాలోని రోహ్‌తక్‌లో ఆప్ ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అవినీతికి, నేరానికి పాల్పడిన వ్యక్తి బిజెపిలో చేరగానే.. ఇడి, సిబిఐ, ఐటి వంటి దర్యాప్తు సంస్థలు అతనిని తాకేందుకు కూడా సాహసించవని విమర్శించారు. 'అవినీతి పరులంటే ఇడి విచారణతో జైలు పాలైన వారు కాదు. ఇడి భయంతో బిజెపిలో చేరిన వారే అవినీతి పరులు. ఇడి దాడులతో జైలు పాలైన వారు, బిజెపిలో చేరని వారు నిజాయితీపరులు. ఎప్పటికైనా వారు జైలు నుంచి బయటికి వస్తారు" అని అన్నారు.

రాయ్‌గఢ్ ఫార్మా కంపెనీలో ప్రమాదం

- ఎనిమిది మృతదేహాల వెలికితీత
- ముగ్గురు గల్లంతు

ముంబయి : మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో అగ్నిప్రమాదం జరిగిన ఒక ఫార్మా కంపెనీ నుంచి ఎనిమిది మృతదేహాలను వెలికి తీశారు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో 11 మంది గల్లంతయ్యారు. మిగిలిన ముగ్గురి కోసం సహాయక బృందాలు గాలిస్తున్నాయి. జిల్లాలోని ఎంఐడిసి మహద్‌లోని బ్లూజెట్ హెల్త్‌కేర్ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగింది. ప్రాథమిక విచారణ ప్రకారం.. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ప్రారంభమయ్యాయి. పరిశ్రమలో రసాయనాలతో నిండిన బారెల్స్ పేలడంతో మంటలు మరింత తీవ్రంగా మారాయి.

19న ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దు : ఖలిస్తాన్ ఉగ్రవాది

న్యూఢిల్లీ/ఒట్టావా : ఈ నెల 19న ఎయిర్ ఇండియా విమానాల్లో సిక్కులు ప్రయాణించవద్దని ఖలిస్థానీ ఉగ్రవాది, నిషేధిత సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్‌ఎఫ్‌జె) అధ్యక్షుడు గురుపత్వంత్ సింగ్ పన్నూన్ హెచ్చరించారు. 'నవంబర్ 19న ఎయిర్ ఇండియాలో ప్రయాణించవద్దని సిక్కు ప్రజలను కోరుతున్నాం. ఆ రోజు ప్రపంచ వ్యాప్తంగా ఎయిర్ ఇండియాను దిగ్బంధిస్తాం. ఆ రోజు ప్రయాణిస్తే మీ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది' అని పన్నూన్ విడుదల చేసిన ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఈ నెల 19న ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయం మూసివేస్తారని పన్నూన్ తెలిపారు. భవిష్యత్తులో ఆ విమానాశ్రయం పేరు కూడా మారుతుందని అన్నారు. ఈ నెల 19న ప్రపంచ క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ జరుగుతుందని చెప్పారు.

పర్మినెంట్ సిబ్బంది కుదింపు

- తాత్కాలిక సిబ్బంది నియామకాలు అంతంతమాత్రం
- లేబర్ మార్కెట్‌లో స్తబ్ధత
- ఎన్‌సిఎఇఆర్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: గత 6 నెలల్లో శాశ్వత సిబ్బందిని నియమించుకునే సంస్థలు సగానికి తగ్గాయని, పోనీ తాత్కాలిక నియామకాలు పెరిగాయా అంటే అదీ లేదనినేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సిఎఇఆర్) సర్వే స్పష్టం చేసింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో శాశ్వత పోస్టులకు రిక్రూట్‌మెంట్‌ను పెంచాలని 30.9 శాతం సంస్థలు యోచించగా, జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఇటువంటి సంస్థలు15.9 శాతానికి పడిపోయాయి. తాత్కాలిక ఉద్యోగుల నియామకాలు ఈ కాలంలో 45 శాతం నుంచి 35.6 శాతానికి పడిపోయాయని ఎన్‌సిఎఇఆర్) తెలిపింది. లేబర్ మార్కెట్‌లో సంక్షోభం తీవ్రతను ఇది తెలియజేస్తోంది. వచ్చే 6 నెలల్లో జాబ్ మార్కెట్ పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంఘటిత రంగంలో కొత్త రిక్రూట్‌మెంట్‌కు అవకాశాలు తగ్గిపోయాయి.. 83.9 శాతం సంస్థల్లో పర్మినెంట్ పోస్టుల భర్తీ చేసే జాడ ఎక్కడా కనిపించడం లేదు. అక్టోబర్‌లో సేవల రంగ వద్ధి మందగించిందని ఎస్‌అండ్‌పి గ్లోబల్ సర్వే ఇదివరకే వెల్లడించింది. అక్టోబరు 31 నాటికి ముగిసిన త్రైమాసికంలో కొత్త ఉద్యోగాల కల్పన కనిష్ట స్థాయికి పడిపోయింది. ఎన్‌సిఎఇఆర్ సర్వే ప్రకారం, సెప్టెంబర్ త్రైమాసికంలో తాత్కాలిక ఉద్యోగుల సంఖ్యను పెంచాలని యోచిస్తున్న సంస్థలను వేళ్లమీద లెక్కించవచ్చు. ఎన్‌సిఎఇఆర్ 126వ రౌండ్ సర్వే సెప్టెంబర్‌లో నిర్వహించారు. ఈ పరిశోధనా సంస్థ మొత్తం 500 కంపెనీలను సర్వే చేసింది. నైపుణ్యం కలిగిన కార్మికుల రిక్రూట్‌మెంట్‌ను పెంచడానికి కంపెనీలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని సర్వే వెల్లడించింది. ఈ సర్వేపై సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పందిస్తూ, "కేవలం 3 నెలల్లో, శాశ్వత సిబ్బందిని పెంచుకోవాలని చూస్తున్న కంపెనీలు 30.9 శాతం నుండి 15.9 శాతానికి పడిపోయాయి. తాత్కాలిక ఉద్యోగులను నియమించుకోవాలని చూస్తున్న కంపెనీలు కూడా వెనకడుగు వేస్తున్నాయి. 'మోడినామిక్స్' వల్ల ప్రజల ఆదాయాలు దిగజారుతున్నాయి. దీంతో డిమాండ్ పడిపోతుంది. అంతిమంగా అది ఆర్థిక వ్యవస్థ కుప్పకూలేందుకు దారి తీస్తుంది" అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వివిధ సందర్భాల్లో భారత దేశ ఆర్థిక వ్యవస్థ భేషుగ్గా ఉందని డాంబికాలు పోతున్నారు. ఆయన చేస్తున్న ప్రకటనలకు, వాస్తవ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రం పూర్తి భిన్నంగా ఉందని ఏచూరి పేర్కొన్నారు. మోదీ చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ఓ ప్రహసనంగా మారిందన్నారు.

ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే 10 అత్యంత కాలుష్య నగరాల జాబితాలో మరోసారి ఢిల్లీ ప్రథమ స్థానంలో నిలిచింది. వరుసగా ఆరో రోజులుగా ఢిల్లీవ్యాప్తంగా దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఆదివారం ఉదయం నాటికి వాయు నాణ్యతా ప్రమాణం (ఎక్యూఐ) సూచీ 460గా ఉంది. ప్రపంచ కాలుష్య నగరాల జాబితాను స్విస్ ఎయిర్ మానిటర్ ఐక్యూఎఐఆర్ ఆదివారం విడుదల చేసింది. ఈ జాబితాలో కోల్‌కతా మూడోస్థానంలో నిలవగా, ముంబయి ఆరోస్థానంలో నిలిచింది. వాయు కాలుష్యం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలలకు (ఐదవ తరగతి వరకు) ఈ నెల 10 వరకు సెలవులను పొడిగిస్తున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది.

శోక సంద్రంగా నేపాల్ గ్రామాలు

- మృతులకు సామూహిక అంత్యక్రియలు
- క్షతగాత్రులకు ఉచిత వైద్యం : ప్రభుత్వ ప్రకటన
- మరోసారి ప్రకంపనలు

ఖాట్మండు : భారీ భూకంపం నుంచి నేపాల్ గ్రామాలు ఇంకా తేరుకోలేదు. శుక్రవారం రాత్రి భూకంపం సంభవించగా, ఇప్పటివరకూ వారికి పూర్తిస్థాయిలో సహాయం లభించడం లేదు. కొన్ని గ్రామాల్లో తాగడానికి మంచి నీరు కూడా లేని పరిస్థితి నెలకొంది. 6.4 తీవ్రతతో వచ్చిన ఈ భూకంపంతో జాజర్‌కోట్, వెస్ట్ రుకుమ్ జిల్లాల్లోని గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయి. రెండు జిల్లాల్లోనూ 157 మంది మరణించగా, సుమారు 400 మంది గాయపడిన సంగతి తెలిసిందే. వందల సంఖ్యలో ఇళ్లు నేలమట్టమయ్యాయి. గ్రామస్తులంతా కలిసి మృతులకు సామూహికం గా అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ట్రాక్టర్లతో దుంగలు, మృతదేహాలను శ్మశాన వాటికలకు తరలించి అంతిమ సంస్కారాలు జరిపిస్తున్నారు. మరణించిన వారిలో ఎక్కువమంది మహిళలు, చిన్నారులు ఉన్నారు.

మళ్లీ భూకంపం
శుక్రవారం అర్ధరాత్రి సంభవించిన భూకంపం నుంచి నేపాల్ తేరుకోకముందే ఆదివారం తెల్లవారు జామున మరో భూకంపం వచ్చింది. 4:38 గంటల సమయంలో 3.6 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది.



అంతులేని విషాదం

ఈ చిత్రంలో ముందు వరుసలో గుండెలవిసేలా విలపిస్తున్న ఇద్దరూ అక్కాచెల్లెళ్లు ఉర్మిళ రావత్, చంద్రకళ రావత్. జాజర్‌కోట్‌లో భేరి ప్రాంతంలో శుక్రవారం రాత్రి పెను విధ్వంసం సృష్టించిన భూకంపానికి వీరు నివసిస్తున్న రావత్‌గ్రామం కేంద్రంగా ఉంది. దీంతో ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. వీరి కుటుంబంలో ఉర్మిళ ఇద్దరు కుమారులు, చంద్రకళ కుమారుడు, కుమార్తె సహా ఆరుగురు చనిపోయారు. కట్టుకున్న ఇళ్లూ కళ్లముందే నేలమట్టమై.. కన్నబిడ్డలూ దూరమైన దయనీయస్థితిలో వీరి రోధనలు అందరినీ కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. భేరి ప్రాంతంలో ఎటుచూసినా ఇలాంటి విషాద దృశ్యాలే.

జబాలియా శరణార్థి శిబిరంపై మళ్లీ దాడి

- పదివేలకు చేరిన గాజా మృతుల సంఖ్య
- అబ్బాస్‌తో బ్లింకెన్ భేటీ

గాజా సిటీ: గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ మరోసారి దాడి చేసింది. బురేజ్ శరణార్థి శిబిరంపై దాడి తరువాత జబాలియాపై విరుచుకుపడింది. ఈ దాడిలో 20 మంది చని పోగా, అనేకమంది గాయపడ్డారు. గత నెల రోజుల్లో ఇజ్రాయిల్ రాక్షసత్వానికి 10వేల మంది పాలస్తీనా పౌరులు మరణించారు. ఒకవైపు ఈ మారణకాండకు ఇజ్రాయిల్‌ను ఎగదోస్తూ, మరోవైపు పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ సమావేశమయ్యారు. పాలస్తీనా సమస్యకు సమగ్ర పరిష్కారం చూపితే, గాజాలోను పాలస్తీనా అథారిటీ అధికారంలోకి తిరిగి రాగలదని అబ్బాస్ బ్లింకెన్‌తో అన్నట్లు రాయిటర్ వార్తా సంస్థ తెలిపింది. గాజా సంధి కుదుర్చుకోవాలని అరబ్ నాయకులతో కలిసి అబ్బాస్ అమెరికాను కోరినట్లు తెలిసింది.

ఇజ్రాయెల్ మంత్రి తొలగింపు
గాజా స్ట్రిప్‌పై అణుబాంబు వేసే అంశాన్ని ఇజ్రాయెల్ పరిశీలిస్తుందని మంత్రి అమిహై ఎలియహు చేసిన వ్యాఖ్యలకు గాను ఆయనను నెతన్యాహు తన మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేశారు



పాలస్తీనాకు సంఘీభావంగా వాషింగ్టన్‌లో వైట్ హౌస్ ఎదుట వేలాది మంది అమెరికన్ల ర్యాలీ

పాలస్తీనాకు సంఘీభావంగా ప్రపంచ వ్యాపితంగా ర్యాలీలు

- వాషింగ్టన్‌లో వైట్ హౌస్ ఎదుట భారీ ప్రదర్శన
- జకార్తాలో పోటెత్తిన జన సంద్రం

వాషింగ్టన్/ జకార్తా: గాజాలో గత నెల రోజులుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని ఆపాలని కోరుతూ శని, ఆది వారాల్లో భారీ ర్యాలీలు ప్రపంచవ్యాపితంగా జరిగాయి. అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలో వైట్ హౌస్ ఎదుట శనివారం వేలాది మందితో పాలస్తీనా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఇజ్రాయిల్ అనాగరిక దాడుల్లో గత 30 రోజుల్లో పది వేల మంది దాకా చనిపోయారు. వీరిలో మహిళలు, పిల్లలే అధికం. ఇజ్రాయిల్ ఊచకోత యథేచ్ఛగా సాగుతున్నా దీనిని ఆపేందుకు అమెరికా ససేమిరా అంటోందని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలస్తీనాలో కనివిని ఎరుగని రీతిలో సాగుతున్న మారణహోమానికి బైడెనే కారణమని నిందించారు. 'బైడెన్ బైడెన్ యు కాంట్ హైడ్' (బైడెన్ బైడెన్ నువ్వు దాక్కోలేవు) అంటూ వారు బిగ్గరగా నినదించారు. గాజాలో ఇజ్రాయిల్ అదే పనిగా సాగిస్తున్న బాంబు దాడులు జాతి ప్రక్షాళనకు దారితీసే ప్రమాదముందని ఐరాస నిపుణులు హెచ్చరించారు. ఇండొనేషియా, పాకిస్తాన్, భారత్‌తో తదితర దేశాల్లోనూ పాలస్తీనాకు సంఘీభావంగా పీపుల్స్ మార్చ్‌లు జరిగాయి.జకార్తాలో జాతీయ స్మృతి చిహ్నం వద్ద బ్రహ్మాండమైన ర్యాలీ నిర్వహించారు.


ఇజ్రాయిల్ ఆటవిక యుద్ధాన్ని ఆపాలని కోరుతూ జకార్తాలోని నేషనల్ మాన్యుమెంట్ వద్ద భారీ ర్యాలీ



మీ కోసం

నల్లబడిన రాగి వస్తువులను ఉప్పులో వెనిగర్ కలిపి దూది ముంచి రుద్దితే కొత్తవాటిలా మెరుస్తాయి.

జీవన సౌరభం

ప్రయత్నించేందుకు ఎప్పుడూ విఫలం కావద్దు.

బాల్యం


ఎల్లలు ఎరుగని వయసు
కల్లాకపటం లేని మనసు
అంతరంగమంతా ఎంతో స్వచ్ఛం
ఆటపాటలే పిల్లల ఆనందం!

గాలిపటాల్లా ఎగురుతూ
బొంగరాల్లా తిరుగుతూ
ఉత్సాహంగా ఉరకలు వేస్తూ
అలసట తెలియని బాల్యం!

మమతల బంధాల అండలో
చెలిమి నవ్వుల తోడుగా
ప్రగతి పథంలో నడుస్తూ
జగతికి వెలుగు నిచ్చే దివ్వెలు!



- కె.వి.సుమలత,
గుడివాడ, కృష్ణజిల్లా.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరసగా కలుపుతూ వెళ్లండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ





సేతు శ్రీవెంకట వీరమల్లు,
5వ తరగతి,
నిర్మలా హైస్కూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

---

కూతురుతో పాటే చదువుతోంది.. ఆడుతోంది ...



చదువుకోవాలని కోరిక ఉన్నా, ఆటలపై శ్రద్ధ ఉన్నా ఆర్థిక పరిస్థితులు సహకరించని ఎందరో మహిళలు అర్ధంతరంగా చదువు ఆపేసి, పెళ్లి, పిల్లలతో కాలం వెళ్లదీస్తుంటారు. కొందరు తమ కలలను, ఆకాంక్షలను పిల్లల ద్వారా నెరవేర్చుకుంటారు. ఆటల్లో, పాటల్లో, చదువులో ఉరకలు వేస్తున్న కన్నబిడ్డల భవిష్యత్తుకు దివిటీల్లా నిలబడతారు ఇంకొందరు. ప్రకాశం జిల్లాకు చెందిన అంజినీదేవి తన కలలకు కుమార్తెను ప్రతిరూపంగా తయారు చేశారు. అంతేకాదు; తానూ బిడ్డతో పాటేచదువు కొనసాగించి ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడ్డారు. తనకు ఇష్టమైన రెజ్లింగ్ క్రీడలో ప్రతిభ కనబరుస్తున్నారు. రెజ్లర్ క్రీడాకారిణిగా పతకాలు సాధిస్తున్న కూతురు నిఖితా దేవితో పాటు పోటీలకు హాజరై సీనియర్ కేటగిరీలో తలపడుతూ, పతకాలు సాధిస్తున్నారు.

ప్రకాశం జిల్లా మార్టూరు మండలం కొలలపూడి గ్రామానికి చెందిన సురగాని అంజినీదేవి దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టారు. తండ్రి వీరభద్రయ్య, తల్లి కోటేశ్వరమ్మ. తండ్రి చిరు వ్యాపారి. కూతురంటే వల్లమాలిన అభిమానం. చదువులో, ఆటలో ఎప్పుడూ ముందుండే అంజినీదేవి స్కూలు స్థాయిలోనే వివిధ ఆటల పోటీల్లో పాల్గొనేవారు. తాత సుబ్బారావు కూడా మనవరాలిని క్రీడాకారిణిగా చూడాలని ఆశపడేవారు. ఇలా సాఫీగా సాగుతున్న అంజినీ దేవి బాల్యంలో, తండ్రి మరణం ఓ పెద్ద కుదుపు.

నాన్న మరణం నా జీవితాన్ని మార్చేసింది

'నేను 9వ తరగతి చదివేటప్పుడే అనారోగ్య కారణాలతో నాన్న చనిపోయాడు. ఆయన మృతి నేను కలలుగన్న భవిష్యత్తును అంధ:కారంలో ముంచేసింది. పదో తరగతి పూర్తయ్యాక మా తాతయ్య నన్ను కాలేజీకి పంపే ధైర్యం చేయలేదు. ఆడపిల్లకు చదువుకంటే పెళ్లి ముఖ్యమనుకున్న ఆ రోజుల్లో బాధ్యత తీరిపోతుందని పెళ్లి చేసేశాడు. ఇద్దరు బిడ్డలు పుట్టారు. నా భర్త దాసరి హనుమంతరావు ప్రైవేటు ఉద్యోగం చేసేవారు. నేను ఆశపడ్డ జీవితం ఇది కాదు. అందుకే ఎలాగైనా నా కలలను నెరవేర్చుకోవాలని లక్ష్యం పెట్టుకున్నాను. ప్రైవేటుగానైనా సరే చదవాలనుకున్నాను. పెళ్లయి పదేళ్ల తరువాత పిల్లలతో పాటు మళ్లీ చదవడం మొదలుపెట్టాను. మొదట్లో అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఒక్కొక్క మెట్టు ఎదుగుతున్న నన్ను చూసి కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు' అంటూ ఆమె చెబుతున్నప్పుడు ఆ మాటల్లో ఆత్మస్థైర్యం తొణికిసలాడింది.

క్రీడల వైపు అడుగులు ...

'మా అమ్మాయి నిఖితాదేవీ నవోదయ స్కూల్లో చదివింది. చదువులో బాగా ముందుండేది. ఆటల్లో కూడా రాణించేది. తనకు కూడా ఆటలంటే ఆసక్తి. స్కూలు తరపున వివిధ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించేది. స్కూలు పూర్తయి గ్రాడ్యుయేషన్‌లోకి వచ్చాక క్రీడలతో పాటు ఆడపిల్లకు ఆత్మరక్షణ విద్య



అవసరమని రెజ్లింగ్ నేర్పించాలనుకున్నాను. అబ్బాయితో పాటే అమ్మాయిని కూడా జిమ్‌లో చేర్పించాను. జిమ్ కోచ్ పాపకు రెజ్లింగ్‌లో శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. రోజూ పిల్లలను తీసుకెళ్లడం, తీసుకురావడం, ఆటలో నిఖితకు వాళ్లు నేర్పించే మెళకువలు నాలో మళ్లీ బాల్యపు ఆశలను రేకెత్తించాయి. నేను కూడా రెజ్లింగ్ ప్రాక్టీస్ చేస్తానని కోచ్‌తో చెప్పాను. చాలా తక్కువ సమయంలోనే సాధన చేశాను. రెజ్లింగ్ ఆటకు శరీర దృఢత్వంతో పాటు మానసిక స్థిరత్వం చాలా అవసరం. చిన్నప్పటి నుండి ఆత్మస్థైర్యంతో ఎదిగిన నేను 7, 8 నెలల స్వల్ప కాలంలోనే రెజ్లింగ్‌లో నైపుణ్యం సాధించి, పోటీలకు సిద్ధమయ్యాను' అంటూ ఆట వైపు తన అడుగులను అంజినీ వివరించారు. ఇప్పుడు ఆమె రెజ్లింగ్‌తో పాటు డిస్కస్ త్రో, హేమర్ త్రో క్రీడల్లో రాణిస్తున్నారు.

సాధించిన విజయాలు..

ఉన్నత కొలువు సాధించాలన్న లక్ష్యంతో చదువు కొనసాగించిన అంజినీ దేవి ప్రైవేటుగానే బిఎ చేశారు. ఆ తరువాత ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుండి ఎంఎ ఇంగ్లీష్ పూర్తిచేశారు. గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమవుతూ వివిధ పోటీ పరీక్షలు రాశారు. ప్రస్తుతం ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ (ఒఎంసి) వార్డు వెల్ఫేర్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్-2 సాధించడమే తన లక్ష్యమంటున్నారు. ఇక రెజ్లర్ క్రీడాకారిణిగా 2021లో తొలిసారి పోటీలో పాల్గొన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన హేమర్ త్రోలో ప్రకాశం జిల్లా తరపున పాల్గొని రాష్ట్రస్థాయి బంగారు పతకం సాధించారు. డిస్కస్ త్రోలో మూడోస్థానం వచ్చింది. ఈ ఏడాది విశాఖ మధురవాడలో నిర్వహించిన స్టేట్‌మీట్‌లో అండర్-19లో 70 కేజీల విభాగంలో నిఖిత, సీనియర్ మహిళల 90 కేజీల విభాగంలో అంజినీ పాల్గొని మొదటిస్థానం సంపాదించారు. దీంతో అక్టోబరు నెలలో హర్యానాలో నిర్వహించిన జాతీయ గ్రాప్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. ఈ పోటీల్లో అమ్మకు బంగారు పతకం వస్తే కూతురు రజతంతో మెరిసింది.



కూతురు ప్రగతికై శ్రమిస్తా..

'నిఖిత సివిల్స్ చదవాలని ఆశపడుతోంది. ఆ దిశగా ఆమెను ప్రోత్సహిస్తా. ఆటలో రాణించేలా కూడా చూస్తా. నేను సాధించలేనిది నా బిడ్డ అందుకుంటే అంతకుమించి సంతోషం ఉండదు' అంటున్న అంజినీలో ఎందరో అమ్మలు కనిపించారు.

అమ్మ నా రోల్ మోడల్

'ఉన్నతవిద్య, ఇష్టమైన ఆట, నచ్చిన కళలో రాణించాలంటే వయసుతో సంబంధం లేద'ని మా అమ్మ నిరూపించింది. నాకు అన్ని విషయాల్లో తోడుంటుంది. ఆటలో కూడా రాణిస్తుంటే చాలా సంతోషమేస్తుంది. మా అమ్మ వంట చేస్తుంది. ఉద్యోగం చేస్తుంది. నాతో పాటు చదువుతుంది. ఆడుతుంది. 'నీకు మంచి ప్రోత్సాహం ఇచ్చే అమ్మ దొరికింది. నువ్వు చాలా లక్కీ' అని నా స్నేహితులు అమ్మ గురించి పొగుడుతుంటే నాకు చాలా ఆనందమేస్తుంది' అని అమ్మ అంజినీదేవి గురించి నిఖిత చెబుతోంది.

ఈ తల్లీ కూతుళ్లు ఒకర్ని మించి మరొకరు స్ఫూర్తిపొందుతూ ముందుకు సాగుతున్నారు. వీరు అనుసరిస్తున్న మార్గం ఎందరో అమ్మలకు, కూతుళ్లకు ఆదర్శం.


- జ్యోతిర్మయి

అమ్మ కళ్లల్లో సంతోషం నా ఎదుగుదలకు ప్రతిబింబం

'నేను చిన్నప్పటి నుండి ఎలాంటి భవిష్యత్తుకై ఆశపడ్డానో అమ్మకు తెలుసు. మా నాన్న మరణంతో నా కలలు, ఆశలు అడియాశలయ్యాయని ఎంతో బాధపడేది. ఇప్పుడు నేను సాధించిన ప్రగతి చూసి నా కంటే మా అమ్మే ఎక్కువ సంతోషపడుతోంది. అమ్మ కళ్లల్లో ఆ ఆనందం నాకు స్పష్టంగా కనిపిస్తోంది' అంటూ తన తల్లి గురించి చెబుతున్నారు అంజినీ దేవి.




చీకటి వెలుగుల రంగేళి దీపావళి



చీకటి వెలుగుల రంగేళి జీవితమే ఒక దీపావళి
మన జీవితమే ఒక దీపావళి.' అంటూ సాగే విచిత్రబంధం చిత్రంలోని ఈ పాట గత ఆరు దశాబ్దాలుగా తెలుగు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటూనే ఉంది. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో అత్యంత అద్భుతమైన సాహిత్యం అందించిన చిరస్మరణీయుడు తెర స్మరణీయుడు, ఆత్మీయ ఆచార్య ఆత్రేయ అర్థవంతమైన గీతానికి కె.వి.మహదేవన్ మరపురాని సంగీతాన్ని స్వరపర్చారు. అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, గానకోకిల పి.సుశీల ఉత్సాహంగా ఉల్లాసంగా ఆలపించారు. అపూర్వమైన మధురానుభూతిని కలిగించిన ఈ పాటలో నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు, కళాభినేత్రి వాణిశ్రీ అభినయం అద్వితీయం... నాటికీ నేటికీ ప్రతి దీపావళి పండుగ రోజున ఈ పాటలను ప్రేక్షకులు వింటూ ఆనందిస్తుండటం తెలిసిందే.

తెలుగు పాటు ఇతర భాషల్లోనూ ఏటేటా వచ్చే సంక్రాంతి, దసరా, దీపావళి వంటి పండుగల సందర్భంగా సినిమాల్లో కొన్ని సన్నివేశాలు, పాటలు మనకు పండగలను గుర్తుచేస్తాయి. అలాంటివాటిలో దేశవ్యాప్తంగా జరుపుకునే పండుగల్లో దీపావళి ఒకటి. దీపాలు వెలిగించి, బాణసంచా పేల్చడంలో పిల్లలు, పెద్దలు ఎంతో ఆనందంగా, సరదాగా జరుపుకునే దీపావళి పండగ నేపథ్యంలో తెలుగు చిత్రాల్లో అనేక పాటలు వచ్చాయి. 1960లో వచ్చిన దీపావళి సినిమాలో 'కరుణా చూపవయా వరము జూపవయా.. మురళీ మోహనా వినీల మేఘ శ్యామా... మనసు నీపైన మరలిన చాలుగా' అంటూ పాట సాగింది. ఎన్‌టిఆర్, సావిత్రి, ఎస్‌విఆర్ నటించారు. కృష్ణుడు, నారద పాత్రల్లో ఎన్టీఆర్, కాంతారావు మెప్పించారు. ఘంటసాల గానం చేశారు.

నాగేశ్వరరావు, కృష్ణకుమారి నటించిన 'పెళ్లి కానుక' చిత్రంలోనూ దీపావళి సందర్భంగా సాగే పాట ఉంది. చెరువు ఆంజనేయశాస్త్రి రచించిన 'ఆడే పాడే పసివాడ ఆడేనోయి నీతోడ ఆనందం పొంగేనోయి దీపావళి' అనే పాట నేటికీ పండుగ వాతావరణాన్ని గుర్తుచేస్తుంది. షావుకారు జానకి, ఎన్‌టి రామారావు నటించిన 'షావుకారు' చిత్రంలోని 'దీపావళి దీపావళి ఇంటింట ఆనంద దీపావళి' అనే పాట నేటికీ ప్రజల నోళ్లలో నానుతోంది. చిరంజీవి, విజయశాంతి నటించిన 'సంఘర్షణ' చిత్రంలోని 'సంబరాలో సంబరాలు దీపావళి పండగా సంబరాలు' పాట పేదలంతా ఆనందంగా జరుపుకునే పండుగను గుర్తుచేస్తుంది. సురేష్, చంద్రమోహన్, వాణి విశ్వనాథ్ ముఖ్య తారాగణంగా నటించిన కుటుంబ కథా చిత్రం 'ఇంటింట దీపావళి'లో 'ఇంటింటి దీపావళి వచ్చేనమ్మా' పాట కుటుంబ సంబంధాలు- బాంధవ్యాలను గుర్తుచేస్తుంది. దాసరి నారాయణరావు నటించిన చిత్రం 'మామగారు'లో 'ఇయ్యాలే అచ్చమైన దీపావళి వెయ్యేళ్లు నిత్యమైన దీపావళి' అంటూ పాట సాగుతుంది. ముద్దుల మనవరాలులో 'ఇన్నాళ్ళకు వచ్చిందో దీపావళి.. మమతల దీపావళి దీప కవితావళి' అంటూ సుహాసిని నర్తించగా భానుమతి, చంద్రమోహన్, జయప్రద నటించారు. జంధ్యాల దర్శకత్వం వహించిన ఈ సినిమాలోని పాటలకు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం సంగీతాన్ని అందించారు. నాగార్జున, సిమ్రాన్ నటించిన 'నువ్వు వస్తావని' చిత్రంలో 'పాటల పల్లకిలో ఊరేగే చిరుగాలి' పాటలో దీపావళి పండుగ ప్రాశస్త్యాన్ని గుర్తుచేశారు.





ప్రభాస్ రెబెల్ చిత్రంలోనూ, 'జనతా గ్యారేజ్' క్లైమాక్స్ సన్నివేశంలో, మాధవి నటించిన 'మాతృదేవోభవ', నాని నటించిన 'జెర్సీ' చిత్రాల్లోని పాటల్లో దీపావళి అంశాలు సాక్షాత్కారమయ్యాయి. దీపావళి సినిమాలో హీరో, హీరోయిన్లలో వేణు, ఆర్తిఅగర్వాల్ మెప్పించారు. 'ఊరువాడా.. ఉత్సాహంగా వెలుగులు చిమ్మే... చుట్టాలంతా సందడిచేసేలా..జోరుగా సందడి చేస్తాం.దీపాల కాంతుల్లో... మస్తుగా చిందులు వేద్దాం' అంటూ సినీ గాయని మంగ్లీ, 'ఆనందాల దివ్య దీపావళి' అంటూ గీతామాధురి ఆలపించిన గీతాలు సామాజిక మాధ్యమాల్లో విశేష ఆదరణ పొందాయి. స్రవంతి మూవీస్ అధినేత స్రవంతి' రవికిశోర్ తొలిసారిగా తమిళంలో నిర్మించిన చిత్రం 'కిడ' తెలుగులో దీపావళి పేరుతో అనువదించారు. ఈనెల 11న తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తున్నారు.

ఆ పాత మధుర గీతాలు శూన్యం

పండుగల సందర్భంగా తాజాగా వస్తోన్న చిత్రాల్లో ఆనాటి మధుర గీతాలు నేడు ఉండకపోవటం బాధాకరం. నాటి పాటల్లో ఆయా పండుగల సంస్కృతిని ప్రతిబింబించేలా సందర్భానుసారంగా కథలు సృష్టించి హృద్యంగా తీసేవారు. ఇప్పుడంతా డబుల్ మీనింగ్ డైలాగులు, భయానక దృశ్యాలు, అర్థంకాని రీతిలో పాటలు వస్తున్నాయి. అయితే అన్ని సినిమాలను అదే గాటన కట్టలేము. స్థానిక భాషలు, యాసలు, జానపదాలు అక్కడక్కడా వస్తున్నాయి. పరిశ్రమలోని అన్ని విభాగాల్లోకి ఔత్సాహికులకు ప్రవేశం దొరకుతుండటం కొంత ఆశాజనకమే.





ఇండియాకు ఎదురేది!

- దుమ్మురేపిన బ్యాటర్లు, కుప్పకూల్చిన బౌలర్లు
- 243 పరుగుల తేడాతో సఫారీపై ఘన విజయం
- విరాట్ కోహ్లి రికార్డు 49వ సెంచరీ
- రవీంద్ర జడేజా ఐదు వికెట్ల మాయాజాలం
- భారత్ 326/5, దక్షిణాఫ్రికా 83/10
- ఐసిసి 2023 ప్రపంచకప్



బ్యాటర్లకు తిరుగులేదు. బౌలర్లకు ఎదురులేదు. ఇదీ ఐసీసీ 2023 ప్రపంచకప్‌లో ఆతిథ్య టీమ్ ఇండియా జైత్రయాత్ర. అగ్ర జట్టు, కఠిన ప్రత్యర్థి దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో కాస్తో కూస్తో ఉత్కంఠ ఆశించిన తటస్థ అభిమానులకు నిరాశే ఎదురైంది. టీమ్ ఇండియా జైత్రయాత్ర ముంగిట దక్షిణాఫ్రికా తేలిపోయింది. ఛేదనలో దక్షిణాఫ్రికా 83 పరుగులకే కుప్పకూలగా.. రవీంద్ర జడేజా (5/33) ఐదు వికెట్ల మాయజాలం ప్రదర్శించాడు. విరాట్ కోహ్లి (101 నాటౌట్), శ్రేయస్ అయ్యర్ (77) మెరుపులతో తొలుత భారత్ 326 పరుగుల భారీ స్కోరు చేసింది. 243 పరుగుల తేడాతో సఫారీని చిత్తు చేసి గ్రూప్ దశలో వరుసగా ఎనిమిదో విజయం సాధించింది.

కోల్‌కత : ఎనిమిదికి ఎనిమిది. టీమ్ ఇండియాకు ఎదురేదీ. ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ 243 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. రవీంద్ర జడేజా (5/33) ఐదు వికెట్ల మ్యాజిక్‌కు మహ్మద్ షమి (2/18), కుల్దీప్ యాదవ్ (2/7) విజృంభించటంతో ఛేదనలో దక్షిణాఫ్రికా 27.1 ఓవర్లలో 83 పరుగులకే చేతులెత్తేసింది. టెయిలెండర్ మార్కో జాన్సెన్ (14, 30 బంతుల్లో 1 ఫోర్) సఫారీ శిబిరంలో టాప్ స్కోరర్. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా 50 ఓవర్లలో 5 వికెట్లకు 326 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (101 నాటౌట్, 121 బంతుల్లో 10 ఫోర్లు) శతకంతో చెలరేగగా, శ్రేయస్ అయ్యర్ (77, 87 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీతో మెరిశాడు. సూర్యకుమార్ (22), రవీంద్ర జడేజా (29నాటౌట్, 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో మెప్పించారు. కెరీర్ 49వ వన్డే సెంచరీ సాధించిన బర్త్‌డే బాయ్ విరాట్ కోహ్లి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత్ తన చివరి మ్యాచ్‌లో నవంబర్ 12న బెంగళూర్‌లో నెదర్లాండ్స్‌తో తలపడనుంది.

కోహ్లి శతక్కొట్టాడు : ఈడెన్ పిచ్ నెమ్మదించింది. పరుగుల వేట గగనమైంది. రెండో ఇన్నింగ్స్‌కు మంచు ప్రభావం ఉండనుంది. అయినా, టాస్ నెగ్గిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు రోహిత్ శర్మ (40, 24 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు), శుభ్‌మన్ గిల్ (23) ధనాధన ఆరంభాన్ని అందించారు. సఫారీ పేసర్లపై దండెత్తిన రోహిత్.. ఆరో ఓవర్లోనే 60 పరుగుల మార్క్ దాటించాడు. ప్రమాకరంగా మారుతున్న రోహిత్‌ను రబాడ వెనక్కి పంపగా.. కండ్లుచెదిరే మాయతో గిల్‌ను కేశవ్ మహరాజ్ సాగనంపాడు. దీంతో 93 పరుగులకు భారత్ ఓపెనర్లను కోల్పోయింది. ఈ స్థితిలో విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ భారత్‌ను ముందుకు నడిపించారు. మూడో వికెట్‌కు 134 పరుగులు జోడించగా కోహ్లి 67 బంతులో అర్ధ సెంచరీ అందుకోగా, అయ్యర్ 64 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. నెమ్మదించిన పిచ్‌పై పరుగుల వేట కష్టమైనా.. తొలుత అయ్యర్ దూకుడు పెంచగా, కోహ్లి సైతం అదే బాటలో నడిచాడు. భారీ షాట్‌కు ప్రయత్నించి అయ్యర్ అవుట్ కాగా.. రాహుల్ (8) ఇబ్బంది పడ్డాడు. సూర్య (22), జడేజా (29 నాటౌట్) చివర్లో కోహ్లితో కలిసి కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. సూర్య ఐదు బౌండరీలు బాదగా.. చివరి ఓవర్లో జడేజా విశ్వరూపం దాల్చాడు. మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో అజేయంగా 29 పరుగులు చేశాడు. 119 బంతుల్లో శతకం సాధించిన కోహ్లి.. 101 పరుగుల అజేయంగా నిలిచాడు. సఫారీ బౌలర్లలో ఎంగిడి,రబాడ, జాన్సెన్, మహరాజ్, షంషి తలా ఓ వికెట్ పడగొట్టారు.

సఫారీ చతికిల : మంచు ప్రభావం అనుకూలతతో సఫారీ బ్యాటర్లు రెచ్చిపోతారని అనుకుంటే.. భారత బౌలర్లు కథ మార్చేశారు. సిరాజ్ తొలి ఓవర్లోనే ఫామ్‌లో ఉన్న డికాక్ (5)ను అవుట్ చేయగా.. పవర్‌ప్లేలోనే బంతి అందుకున్న జడేజా.. సఫారీ కెప్టెన్ బవుమా (11) కథ ముగించాడు. కొత్త బంతితో జడేజా మాయజాలం ముంగిట సఫారీ బ్యాటర్లు తేలిపోయారు. స్పిన్ బాగా ఆడగల క్లాసెన్ (1), డెవిడ్ మిల్లర్ (11) జడేజాకు దాసోహం అయ్యారు. వాండర్ డుసెన్ (13), మార్క్‌రామ్ (9)లను షమి సాగనంపాడు. దీంతో 59 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా చేతులెత్తేసింది. మార్కో జాన్సెన్ (14) ఓటమి అంతరం కుదించే ప్రయత్నం చేశాడు. కుల్దీప్ యాదవ్ సైతం రెండు వికెట్లతో మెరువగా.. 27.1 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా 83 పరుగులకు కుప్పకూలింది. 243 పరుగుల తేడాతో భారత్ గెలుపొందింది.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) బవుమా (బి) రబాడ 40, గిల్ (బి) మహరాజ్ 23, విరాట్ కోహ్లి నాటౌట్ 101, శ్రేయస్ అయ్యర్ (సి) మార్క్‌రామ్ (బి) ఎంగిడి 77, కెఎల్ రాహుల్ (సి) వాండర్ డుసెన్ (బి) జాన్సెన్ 8, సూర్యకుమార్ (సి) డికాక్ (బి) షంషి 22, రవీంద్ర జడేజా నాటౌట్ 29, **ఎక్స్‌ట్రాలు :** 26, మొత్తం : (50 ఓవర్లలో 5 వికెట్లకు) 326.

వికెట్ల పతనం : 1-62, 2-93, 3-227, 4-249, 5-285.

బౌలింగ్ : లుంగిసాని ఎంగిడి 8.2-0-63-1, మార్కో జాన్సెన్ 9.4-0-94-1, కగిసో రబాడ 10-1-48-1, కేశవ్ మహరాజ్ 10-0-30-1, షంషి 10-0-72-1, ఎడెన్ మార్క్‌రామ్ 2-0-17-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : డికాక్ (బి) సిరాజ్ 5, బవుమా (బి) జడేజా 11, వాండర్ డుసెన్ (ఎల్బీ) షమి 13, మార్క్‌రామ్ (సి) రాహుల్ (బి) షమి 9, క్లాసెన్ (ఎల్బీ) జడేజా 1, డెవిడ్ మిల్లర్ (బి) జడేజా 11, మార్కో జాన్సెన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 14, కేశవ్ మహరాజ్ (బి) జడేజా 7, కగిసో రబాడ (సి,బి) జడేజా 6, లుంగి ఎంగిడి (బి) కుల్దీప్ 0, షంషి నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 2, మొత్తం : (27.1 ఓవర్లలో ఆలౌట్) 83.

వికెట్ల పతనం : 1-6, 2-22, 3-35, 4-40, 5-40, 6-59, 7-67, 8-79, 9-79, 10-83.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 5-0-14-0, మహ్మద్ సిరాజ్ 4-1-11-1, రవీంద్ర జడేజా 9-1-33-5, మహ్మద్ షమి 4-0-18-2, కుల్దీప్ యాదవ్ 5.1-1-7-2.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68